
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం 7 డిసెంబరు 2025

రూ.కోట్లు కొల్లగొట్టి.. పోలీసులకు చిక్కి..

- ఎర్రబోయినపల్లిలో సైబర్ క్రైం పోలీసులు
- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న ఖాకీలు?

6



ఏకగ్రీవాల్లో పైచేయి!

- రెండో విడతలో 17 పంచాయతీలు కాంగ్రెస్ ఖాతాలో
- మూడు గ్రామాల్లో సీపీఐ పాగా
- మాస్‌లైన్‌కు ఒకటి, బీఆర్ఎస్‌కు ఒకటి..
- మూడోవిడతలో ఉపసంహరణ కోసం తీవ్ర ప్రయత్నాలు
- ఏకగ్రీవాలకు నై అంటున్న యువత

ఖమ్మం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల్లో రెండోవిడత నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయింది. ఈ క్రమంలో అభ్యర్థులు ప్రచారపర్వాన్ని ఆదివారం నుంచి ప్రారంభించబోతున్నారు. అయితే మొదటవిడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో మొత్తం 20పంచాయతీలు ఏకగ్రీవం కాగా.. 19పంచాయతీలు దక్కించుకున్న కాంగ్రెస్.. రెండో విడతలోనూ 'పై'చేయి' సాధించింది. మొదటవిడతలో మొత్తం 20పంచాయతీలు ఏకగ్రీవంకాగా 19కాంగ్రెస్, 1 సీపీఐ కి దక్కింది. ఇక రెండో విడతలో మొత్తం 22 పంచాయతీల్లో 17 కాంగ్రెస్ దక్కించుకోగా సీపీఐ3, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్1, బీఆర్ఎస్‌కు 1 దక్కాయి. కామేపల్లి మండలంలో మొత్తం 6 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో కాంగ్రెస్‌కు నాలుగు దక్కాయి. పాతలింగాల పంచాయతీలో కిన్నెర సుజాత ఏకగ్రీవంగా ఎన్నికవగా.. ఈపంచాయతీలో 50 ఏళ్లుగా ఏకగ్రీవమే సంప్రదాయంగా వస్తోంది. దివంగత మాజీమంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి స్వగ్రామమమైన పాతలింగాల పంచాయతీ ఏర్పడిన 1967తొలినాళ్లలో మాత్రమే ఇక్కడ ఎన్నిక జరిగింది. ఆతర్వాత 1972నుంచి ఏకగ్రీవమే అవుతోంది. జోగ్గూడెంలో భూక్యా సైదమ్మ ఎన్నికవగా.. ఇక్కడ సర్పంచ్ ఏకగ్రీవం చేస్తే రూ.20లక్షలతో ఆంజనేయస్వామి గుడి కట్టిస్తామని సైదమ్మ భర్త హామీ ఇచ్చారు. అయినా మరో ఇద్దరు నామినేషన్లు వేయగా.. గ్రామస్థుల చర్చల అనంతరం వారు ఉపసంహరించుకున్నారు. దీంతో ఆమె ఏకగ్రీవమయ్యారు. కెప్టెన్‌బంజరలో ఆరెం అచ్చమ్మ, లాల్యాతండా మాలోతు సౌజన్య, ఊట్కూరు ఈసం హనుమంతరావు సీపీఐ మద్దతుతో ఎన్నికయ్యారు. నేలకొండపల్లి మండలంలో మూడు కాంగ్రెస్‌కు ఏకగ్రీవమవగా ఆచార్లగూడెం పంచాయతీ సర్పంచ్‌గా కొలికపోగు ఉప్పలమ్మ, కట్టుకాచారంలో బానోతు సైదులు, అజయ్‌తండా తేజావత్ శివాజి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంరూరల్ మండలంలో రెండు (మిగతా 8వ పేజీలో)


పంచాయతీ బరి.. భవితకు గురి



- స్థానిక సంస్థల ఎన్నికలతో రాజకీయాల్లోకి ప్రవేశం..
- సర్పంచ్‌ల పదవుల నుంచి చట్టసభల్లోకి..
- ఉమ్మడి జిల్లాలో పలువురు నేతలు ఇలా ఎదిగిన వారే..

ఇల్లెందు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా రాజకీయ రంగంలో ప్రవేశించిన పలువురు ప్రముఖులు.. ఆ తర్వాత ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలుపొంది రాష్ట్ర మంత్రులుగా కూడా ఎన్నికయ్యారు. కొత్తగూడెం శాసన సభ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన వనమా వెంకటేశ్వరరావు రాజకీయ ప్రస్థానం తొలుత సర్పంచ్ స్థాయి నుంచే ప్రారంభమైంది. ఆయన పాల్వంచ గ్రామ పంచాయతీ నుంచి రెండుసార్లు సర్పంచ్‌గా గెలుపొందారు. ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు గెలుపొందగా.. ఒక సారి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం సీపీఐ శాసన సభా పక్షనాయకుడిగా వ్యవహరిస్తున్న కూనంనేని సాంబశివరావు సైతం చుంచుపల్లిలో ఎంపీటీసీగా గెలుపొంది.. ఆ తర్వాత మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తాజాగా.. కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. దివంగత రాంరెడ్డి వెంకట్‌రెడ్డి ఇల్లెందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలం పాతలింగాల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గానే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత సుజాతనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది.. మంత్రిగా పనిచేశారు. దివంగత సీపీఐ నాయకుడు మహమ్మద్ రజబ్‌అలీ సైతం తొలుత పాపటపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గానే ఎన్నికయ్యారు. ఆయన సేవా నిరతి మూలంగా తదనంతరం సుజాతనగర్, ఖమ్మం శాసనసభ స్థానాల నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాజకీయ ఉద్దండుడిగా (మిగతా 6వ పేజీలో)

భిన్న రాజకీయాలకు వేదికగా.. రాజకీయ చైతన్యానికి గుమ్మంగా పేరొందిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక మంది రాజకీయ ఉద్దండులకు స్థానిక సంస్థల ఎన్నికలే చట్టసభలకు తొలిమెట్టుగా నిలిచాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గుర్తింపు పొందిన అనేక మంది నేతలు.. ప్రజా సేవలో ప్రజా ప్రతినిధులుగా వెలుగొందారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా గడించిన ఖ్యాతి, సేవాభావం వారికి ప్రత్యేక గుర్తింపును ఇచ్చింది. రాజకీయ వైకుంఠపాలిలో వెనుదిరగకుండా ప్రజా సేవలో తొలిమెట్టుగా నిలిచే స్థానిక స్వపరిపాలన సంస్థల్లో ప్రజల ప్రత్యక్ష ప్రమేయంతో జరిగే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు సహకార సొసైటీల ఎన్నికలతోనే ప్రస్థానాన్ని ప్రారంభించిన నేతలు.. ఆ తర్వాత అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆనాడు ప్రజాప్రతినిధులు చట్టసభల్లో ప్రవేశించడానికి స్థానిక సంస్థల్లో అందించిన సేవలు. ప్రాతినిధ్యం వహించిన పార్టీలకు అందించిన కమిట్‌మెంట్, కార్యదక్షత.. ఆ తర్వాత అనేక మందిని ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా, మంత్రులుగా తీర్చిదిద్దాయి. అనేకమంది ప్రముఖులు నేటితరం రాజకీయ నేతలకు ఆదర్శంగా నిలిచారు. నూతనంగా ఎన్నిక కానున్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకంగా మారారు. స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగి రాజకీయ ఆరంగేట్రంలో 'ఇంట గెలిచి..రచ్చ గెలవాలి' అన్న నానుడిని అక్షరాలా సార్థకం చేసిన పలువురు ప్రముఖులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కనిపిస్తారు.





'ఎఫ్రీ చైల్డ్ రీడ్స్' రెండో దశ అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

- టీచర్ ఫీడ్ బ్యాక్ ప్రకారం ప్రత్యేక మెటీరియల్స్ సిద్ధం
- పిల్లలకు ఫోనెటిక్స్‌తో పదాలు చదవడం నేర్పించాలి
- అధికారులతో సమీక్షలో ఖమ్మం కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పిల్లల పఠన సామర్థ్యం పెంపునకు ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం రెండో దశను అమలు చేయాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లు, పాఠశాల సిబ్బందితో కలిసి ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలుపై కలెక్టర్ సమీక్షించి.. దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం మొదటి దశను విజయవంతంగా అమలు చేసిన ఉపాధ్యాయులను, పాఠశాల సిబ్బందిని అభినందించారు. రెండో దశ కార్యక్రమంపై ఉపాధ్యాయులు అందించిన ఫీడ్ బ్యాక్ ప్రకారం కార్యాచరణ సిద్ధం చేసినట్టు తెలిపారు. రెండో దశ కార్యక్రమంలో పిల్లల కోసం రెండు రకాల స్టడీ మెటీరియల్స్‌ను సిద్ధం చేశామన్నారు. వెనుకబడిన విద్యార్థులకు బేసిక్స్ మరింత బలోపేతం చేసేలా మెటీరియల్, మంచి ప్రగతి సాధించిన విద్యార్థులకు వైవిధ్యమైన పదాలతో కూడిన మెటీరియల్ తయారు చేశామన్నారు. ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం ప్రారంభించిన మొదటి వారం కేవలం 11 శాతం విద్యార్థులు మాత్రమే వ్యాఖ్యలు చదివే సామర్థ్యంతో ఉన్నారని.. గత బుధవారం ఆ సంఖ్య 36 శాతానికి చేరిందని కలెక్టర్ తెలిపారు. పిల్లలకు జీవిత కాలం ఉపయోగపడే సామర్థ్యాన్ని మనం అందిస్తున్నామన్నారు. రెండో దశ ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలులో పదాలు చదివే సామర్థ్యం ఉన్న పిల్లలు వ్యాఖ్యలు చదివేలా, అక్షరాలను చదివే పిల్లలు పదాలు చదివేలా సామర్థ్య పెంపునకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జనవరి మొదటి వారం వరకు 75 శాతం విద్యార్థులకు వ్యాఖ్యలు చదివే సామర్థ్యం రావాలని కలెక్టర్ సూచించారు. ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం పాఠశాలలో కొనసాగించాలని, ప్రతీ రోజు ఒక గంట సమయం రీడింగ్ కోసం కేటాయించాలన్నారు. ఆంగ్ల భాష ఫోనెటిక్స్ బేసిక్‌గా ఈ కార్యక్రమం డిజైన్ చేశామని, పిల్లలు బట్టీ పద్ధతుల్లో చదవకుండా ఆ పదాన్ని ఆ శబ్దం ఎందుకు వస్తుందో ఫోనెటిక్స్‌తో నేర్చుకోవాలన్నారు. పిల్లలకు పదాలు చదవడం నేర్పే సమయంలో ప్రతీ అక్షరం ఏ సౌండ్ చేస్తుందో తెలియజేయాలన్నారు. సులువైన పదాలతో ప్రారంభించి సరళంగా ఆంగ్లం చదివే సామర్థ్యం వచ్చేలా మెటీరియల్ తయారు చేశామన్నారు. ప్రతీ బుధ వారం విద్యార్థి రీడింగ్ స్కిల్స్ ఏ స్థాయిలో ఉన్నాయో (అక్షరాలు, పదాలు, వ్యాఖ్యలు) యాప్ లో అప్ డేట్ చేయాలని, ఉపాధ్యాయులు వాస్తవ పరిస్థితులను అప్ డేట్ చేయాలని, తప్పుడు రిపోర్టులను పెట్టొద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో పిల్లలకు రోజు రీడింగ్ చేసే అలవాటు వచ్చిందన్నారు. ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలు చాలా సంతృప్తిని కలిగించిందన్నారు. అనంతరం కలెక్టర్ ఉపాధ్యాయుల నుంచి ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలు ద్వారా వచ్చిన ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్. రామకృష్ణ, సీఎంవో ప్రవీణ్, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

'గుమ్మడి' బయోపిక్ రాష్ట్రానికే గర్వకారణం



గుమ్మడి నర్సయ్య చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చిత్రంలో హీరో శివరాజ్‌కుమార్, గుమ్మడి నర్సయ్య, కల్వకుంట్ల కవిత, మల్లు నందిని

- ఐదు భాషల్లో చిత్రం తీయడం సినీ చరిత్రలో ఓ రికార్డ్
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- జిల్లా ఉద్యమకారుల పాత్ర మరువలేనిది : కవిత
- చిత్ర షూటింగ్ ప్రారంభంలో పాల్గొన్న ప్రముఖులు

వివరాలు 6లో..

పగలు ప్రచారాలు.. రాత్రి మంతనాలు



- పల్లెల్లో సర్పంచ్ అభ్యర్థుల ఆపసోపాలు
- రాత్రికి రాత్రే పార్టీల మార్పు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు
- పలుచోట్ల అన్నీ తామై వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1042 పంచాయతీలు, 9382 వార్డులు ఉన్నాయి. ఈ నెల 11,14,17వ తేదీల్లో మూడు విడతలుగా 'పంచాయతీ' పోరు జరగనుంది. తొలి విడతలో ఏకగ్రీవమైన పంచాయతీలను మినహాయించి.. మిగిలిన పల్లెల్లో ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించగా.. బరిలో నిలిచిన అభ్యర్థులు గుర్తులతో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇక రెండో విడతకు సంబంధించి కొన్ని పంచాయతీలు ఏకగ్రీవం కాగా.. మరికొన్ని చోట్ల ఏకగ్రీవం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇక పోటీ తప్పదు అనే పంచాయతీల్లో మాత్రం బరిలో నిలిచిన అభ్యర్థులు గుర్తులు లేకుండానే ప్రచారం చేసుకుంటున్నారు. తమను సర్పంచ్‌గా గెలిపిస్తే పంచాయతీలో చేపట్టే పనులను వివరిస్తున్నారు. అనేక రకాల హామీలను ఇస్తూ ముందుకు సాగుతున్నారు. ఓటర్లు కూడా అభ్యర్థుల ముందు తమ సమస్యలు ఉంచుతుండగా.. వారు పరిష్కారానికి హామీలు గుప్పిస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వ పరంగా పథకాలు అందేలా చూస్తామంటూ అభ్యర్థులు హామీలు ఇస్తున్నారు. పల్లెల్లో ఆర్థిక అంగ బలంతో అనేక మంది ఊహించని విధంగా పార్టీల పెద్దలను కూడా తీసుకొచ్చి ప్రచారం చేస్తున్నారు.

జోరుగా మంతనాలు

పగలంతా ప్రచారాలు చేసుకుంటున్న సర్పంచ్ అభ్యర్థులు.. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో రాత్రివేళల్లో జోరుగా మంతనాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల రెబల్స్ బెడద ఉంది. అందులోనూ అధికార పార్టీకి అధికంగా ఉంది. దీంతో అభ్యర్థులు తమ పార్టీలో ఉంటూ రెబల్స్‌కు మద్దతు ఇచ్చేవారితో పాటు ప్రత్యర్థి పార్టీలో ఉన్న నాయకుల వద్దకు వెళుతున్నారు. ఈ ఒక్కసారి తమకు మద్దతు ఇవ్వాలని.. అందుకు ప్రతిఫలంగా ఏం కావాలో చెప్పాలంటూ అడుగుతున్నారు. చాలా చోట్ల ఆర్థిక హామీలతోనే అభ్యర్థులు ముందుకు సాగుతున్నట్లుగా (మిగతా 6వ పేజీలో)



కేక్ కట్ చేస్తున్న సీపీ సునీల్‌దత్

పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు కీలకం

సీపీ సునీల్‌దత్

ఖమ్మం క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు ఎంతో కీలకమని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పేర్కొన్నారు. హోంగార్డుల దినోత్సవం సందర్భంగా శనివారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీస్ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి హోంగార్డులకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం సీపీ మాట్లాడారు. విధి నిర్వహణలో అత్యంత ప్రతిభచూపిన హోంగార్డులకు ప్రశంస పత్రాలు అందజేశారు. సాధారణ విధులు మొదలు వరదలు లాంటి క్లిష్టతర విధుల వరకు అన్నింటా చక్కగా పని చేస్తున్నారని ప్రశంసించారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసుల ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. హోంగార్డుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఎస్బీ ఏసీపీ మహేష్, సీఐ రాజిరెడ్డి, ఏఆర్ ఏసీపీలు సునీల్‌సింగ్, నర్సయ్య, ఆర్ఐ సురేష్, కామరాజు, సాంబశివరావు, నాగుల్‌మీరా, హోంగార్డుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు పటిష్ట చర్యలు

విలేకరుల సమావేశంలో డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్

ఖమ్మం కార్పొరేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ పేర్కొన్నారు. ఇటీవల వన్యప్రాణుల వేట జరుగుతుండటం, నిందితులపై కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఆయన శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన పలు కేసులను దృష్టిలో పెట్టుకొని నిఘా మరింత పెంచామని, టాస్క్‌ఫోర్స్ బలగాలను పటిష్ఠంగా నిర్మాణం చేస్తామన్నారు. ఇటీవల సత్తుపల్లి అర్బన్ పార్కులో చోటు చేసుకున్న వన్యప్రాణుల వేటపై నిందితులను కోర్టుకు రిమాండ్ చేశామన్నారు. వన్యప్రాణుల వేటలో ప్రధాన నిందితుడ్ని జైలుకు పంపటం జరిగిందన్నారు. అక్రమంగా ఆయుధాలను కలిగి ఉండి వన్యప్రాణులకు హాని కలిగించటంపై కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



మాట్లాడుతున్న డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్

ఉద్యోగులకు ఓట్ల సంకటం..

- గ్రామాల్లో తక్కువగా పోస్టల్ బ్యాలెట్లు
- లెక్కింపుల్లో ఓటు బహిర్గతం అవుతుందని ఆందోళన

7

కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీ!

- ఇల్లెందు మండలంలో ప్రత్యర్థి పార్టీల మధ్య ఒప్పందం
- ఏకగ్రీవం దిశగా రెండు పంచాయతీలు..
- అధికారిక ప్రకటనే తరువాయి

7

'గుమ్మడి' బయోపిక్ రాష్ట్రానికే గర్వకారణం

- ఐదు భాషల్లో చిత్రం తీయడం సినీ చరిత్రలో ఓ రికార్డ్
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- జిల్లా ఉద్యమకారుల పాత్ర మరువలేనిది : కవిత
- చిత్ర షూటింగ్ ప్రారంభంలో పాల్గొన్న ప్రముఖులు




వేదికపై మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని, ఎమ్మెల్సీ కవిత, మల్లు నందిని, నటుడు శివరాజ్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

పాల్వంచ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చలన చిత్ర రంగంలో గుమ్మడి నర్సయ్య బయోపిక్ రాష్ట్రానికే గర్వకారణమని రోడ్లు, భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఐదు భాషల్లో ఈ చిత్రం తీయడం సినీ చరిత్రలో ఓ రికార్డ్ అని, నూతన అధ్యాయం అని అన్నారు. శనివారం పాల్వంచలో హెచ్‌కన్వెన్షన్ హాల్‌లో కొనసాగిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిత్ర పరిశ్రమలో ఇప్పటి వరకు ఏ కార్యక్రమానికి తాను వెళ్లలేదని.. కానీ గుమ్మడి నర్సయ్య బయోగ్రఫీ చిత్రాన్ని తీస్తున్నారని ఆహ్వానించడంతో ఈ కార్యక్రమానికి వచ్చినట్టు తెలిపారు. తాను అనేకమార్లు అసెంబ్లీకి వెళ్లిన సందర్భాల్లో సైకిల్‌పై సాధారణ వ్యక్తిగా గుమ్మడి నర్సయ్య వచ్చేవారని చెప్పారు. ఇలాంటి నాయకులు ఉండడం చాలా అరుదుగా ఉంటారన్నారు. నాడు పుచ్చలపల్లి సుందరయ్య, నల్లమల్ల గిరిప్రసాద్, కొంత మంది నాయకుల పేర్లు వినిపించేవని.. ఆ తర్వాత గుమ్మడి నర్సయ్య ప్రత్యక్షంగా కనిపించారన్నారు. ప్రజలలో నాలుకలా ఉండడం వల్లే ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. డబ్బులు పెట్టకుండా ప్రజలు ఎన్నుకున్న నాయకుడిగా ఎదిగిన ఏకైక వ్యక్తిగా గుమ్మడి నర్సయ్య పేరు చిరస్థాయిలో ఉంటుందన్నారు. ఈ చిత్రం తెరకెక్కించడంతో బాహుబలి, ట్రిపుల్ ఆర్‌ల సినిమాకు మించి మన్ననలు పొందాలని ఆశించారు. ఈ చిత్రంలో కన్నడ సూపర్‌స్టార్ రాజ్‌కుమార్ నటించడం మరింత ప్రాచుర్యం పొందుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. నాడు తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నేడు దండకారణ్యంలో పోరాడుతున్న వామపక్ష భావాజాలాలు కలిగిన నాయకుల త్యాగాలు మరువలేనివన్నారు. ఆదివాసీ బిడ్డగా ఎర్రజెండా పట్టి చిన్నతనం నుంచే గుమ్మడి నర్సయ్య తనదైన పంథాలో పోరాటాలు నిర్వహించారన్నారు. ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసి.. ఆ తర్వాత సాధారణ వ్యక్తిగా జీవనం సాగించడం ఎవరికీ సాధ్యపడదన్నారు. గుమ్మడి నర్సయ్య బయోపిక్ చిత్రం ప్రతీ ఒక్కరికి ఆదర్శంగా నిలవాలన్నారు. జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా పోరాటాల ఖిల్లాగా పేరొందిందన్నారు. పోరాటాల పురిటిగడ్డ, నల్లని నేల తల్లి పై పుట్టిన గుమ్మడి నర్సయ్య నిస్వార్థ రాజకీయ పరుడుగా పేరుపొందారన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఖమ్మం ఉద్యమకారుల చరిత్ర మరువలేనిదన్నారు. ఈ కోవలోనే గుమ్మడి నర్సయ్య పాత్ర ఎనలేనిదన్నారు. ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ.. ఒక మట్టి మనిషి కథను ఒక గట్టి హీరోతో సినిమా తీయడం చిత్ర పరిశ్రమలో ఇదొక కొత్త మార్పుగా గుర్తించాలన్నారు. గుమ్మడి జీవిత చరిత్రను తెరపైకి తేవడం శుభపరిణామమన్నారు. ఆదివాసీల గొంతును వినిపించే శక్తిగా గుమ్మడి నర్సయ్య ఉండడం ఆదర్శమన్నారు. డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని మాట్లాడుతూ.. ఈ కాలంలో ఇలాంటి నాయకుల మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ పీవీ శ్రీనివాస్, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, చిత్ర నిర్మాత నల్లూరి సురేష్ రెడ్డి, డైరెక్టర్ రమేష్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, సినీ నిర్మాత నల్లా సురేష్ రెడ్డి, దర్శకులు పరమేశ్వర్ హివ్రాలే తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు, వాకిలి చూసి నా కళ్లల్లో నీళ్లు ఉబికాయి

కన్నడ హీరో శివరాజ్ కుమార్

'నేను, నా సతీమణి గుమ్మడి నర్సయ్య ఇంటికి వెళ్లగానే ఆ ఇల్లు, వాకిలి చూసి నా కళ్లల్లో నీళ్లు ఉబికాయి. అప్పటి వరకు స్క్రిప్ట్ చూసి ఈ చిత్రానికి హీరోగా చేయాలని నిర్ణయించుకుని ట్రైలర్ షూటింగ్‌లో పాల్గొన్నాను. ప్రత్యక్షంగా చూసే సరికి కళ్లు చెమ్మగిల్లాయి. 25 ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి ఇల్లు ఇలా ఉంటుందా.. అని అనుకున్నాను. కనీస సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగానే కనిపించడం.. గుమ్మడి నర్సయ్య సతీమణి ఒక గ్రామీణ మహిళ వేషధారణలో ఉండడం ఆశ్చర్యంగానే కనిపించింది. ఇంటికి పెచ్చులు లేసిన గోడలు, అక్కడక్కడ రేకులకు సపోర్ట్‌గా పెట్టిన కర్రలు చూస్తే వింతగానే కనిపించింది. ఇన్నేళ్లు ఎమ్మెల్యేగా చేసిన వ్యక్తి ఎంతో కొంతైనా కూడబెట్టుకుని సమాజంలో ఒక మధ్యతరగతి స్థాయిలో ఉంటారని అనుకున్నాను. కానీ పూర్తిగా స్క్రిప్ట్‌కు అనుగుణంగానే కనిపించింది. ఈ చిత్రానికి నేను అర్హుడుని గుర్తించడం అభినందనీయం' అని అన్నారు.

రూ.కోట్లు కొల్లగొట్టి..
పోలీసులకు చిక్కి..

- ఎర్రబోయినపల్లిలో సైబర్ క్రైం పోలీసులు
- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న ఖాకీలు ?

సత్తుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ కేంద్రంగా ఆస్ట్రేలియా పౌరులను మోసగించి రూ.కోట్లు కొల్లగొట్టిన కేసుకు సంబంధించి ప్రధాన నిందితుల స్వగ్రామమైన ఎర్రబోయినపల్లికి శనివారం సైబర్‌క్రైం పోలీసులు చేరుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం ఐదుగురిని వారు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో రిట్జ్ సొల్యూషన్స్ పేరుతో కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి రూ.కోట్లు కొట్టేసిన ప్రధాన నిందితులు ప్రవీణ్, ప్రకాష్ కోసం పోలీసులు గాలిస్తున్న విషయం తెలిసిందే. ప్రకాష్‌ను విచారించే క్రమంలో అతని ఇంటిలో దశదిన కర్మ సందర్భంగా ముగ్గురు పూచికత్తుతో అతనిని ఎర్రబోయినపల్లిలోనే ఉండేందుకు అవకాశం ఇచ్చారు. అయితే దశదిన కర్మ అనంతరం కూడా ప్రకాష్ సైబర్‌క్రైం పోలీసుల వద్దకు వెళ్లకపోవడంతో.. శనివారం పోలీసులు ఎర్రబోయినపల్లికి చేరుకున్నారు. ప్రకాష్ కాశీ వెళ్లాడని పోలీసులకు కుటుంబ సభ్యులు చెప్పినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రకాష్‌కు జామీను ఉన్న ముగ్గురిని, అతని తండ్రిని, మరో ప్రధాన నిందితుడు ప్రవీణ్ తండ్రిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కేసులో ఇప్పటికే కల్లూరు మండలం లింగాల గ్రామానికి చెందిన యేపూరి గణేష్ (టెలీకాలర్), వేంసూరు మండలం లింగపాలెం గ్రామానికి చెందిన మోరంపూడి చెన్నకేశవతో పాటు కోల్‌కతాకు చెందిన మరో ఏడు మందిని అరెస్టు చేయగా.. శుక్రవారం వేంసూరుకు చెందిన టి.పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా.. సైబర్ క్రైం పోలీసులు ఎర్రబోయినపల్లికి చేరుకోవడం.. స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. ఎవరెవరిని అదుపులోకి తీసుకున్నారనే విషయాన్ని మాత్రం సంబంధిత అధికారులు ధ్రువీకరించలేదు. త్వరలోనే వారు వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

భద్రాచలం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఈ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు. అలాగే ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ భద్రాద్రి రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా

టీఎంఈసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంకూషావలి

కొత్తగూడెం అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మున్సిపల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎంఈసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంకూషావలి అన్నారు. శనివారం కొత్తగూడెం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశమందిరంలో తెలంగాణ మునిసిపల్ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరమ్ (టీఎంఈసీఎఫ్) కార్యదర్శి ఎల్.వీ. సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకూషావలి మాట్లాడుతూ.. ప్రజలకు సేవలను అందించే మున్సిపల్ ఉద్యోగులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి డిమాండ్లను పట్టించుకోకపోవడంతో ఉద్యోగులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. సమావేశంలో వార్డు అధికారులు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో నియామకం జరిగిందని, ఉద్యోగోన్నతిలో అవకాశం ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగులు మాట్లాడుతూ.. మున్సిపల్ విభాగంలో ఖాళీలను భర్తీ చేసి పని ఒత్తిడి తగ్గించాలని, సర్వీస్ రూల్స్‌పై స్పష్టత కరువైందని సమస్యలను ఏకరువు పెట్టారు. మున్సిపాలిటీలో ప్రమోషన్లు, బదిలీలు, క్యాడర్ నియామకం వంటి అంశాల్లో ఏకరీతిలో అమలు కావడం లేదని, మంజూరైన పోస్టులకు సంబంధించి మున్సిపాలిటీల్లో విభిన్న రీతిలో విధానాలు అమలుచేయడం వల్ల మున్సిపల్ ఉద్యోగుల హక్కులను దెబ్బతీస్తున్నాయన్నారు. అందువల్ల తమ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ, సభ్యత నమోదుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆసంఘ అసోసియేట్ అధ్యక్షుడు అశోక్‌చౌహాన్, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, ఆఫీస్ సెక్రటరీ శేషు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, ఉద్యోగులు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంకూషావలి

సొంతింటి కలను నిజం చేసేందుకే..
క్రెడాయ్ ప్రాపర్టీ షో

● **ఖమ్మం మేయర్ నీరజ**

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పథంలో పయనిస్తున్న ఖమ్మం జిల్లావాసుల సొంతింటి కలను సాకారం చేసేందుకే క్రెడాయ్ ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ నీరజ తెలిపారు. శనివారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను మేయర్ ప్రారంభించి మాట్లాడారు. ఈ అవకాశాన్ని జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. గతంలో ఖమ్మం జిల్లా అంటే గ్రానైట్ రంగానికి ప్రసిద్ధి అని, ప్రస్తుతం ఖమ్మం జిల్లా అంటే అపార్టుమెంట్‌లకు, విల్లాలకు, రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి ప్రసిద్ధి అని అన్నారు. హైదరాబాద్ తర్వాత అంతటి గొప్ప నగరంగా ఖమ్మం ఉందన్నారు. అనంతరం రాష్ట్ర క్రెడాయ్ చైర్మన్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బండి జయకిషోర్‌లు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకే ఈ ప్రాపర్టీ షోను ఖమ్మంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు దీనివల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇంటి నిర్మాణం నుంచి బ్యాంక్ లోన్ల వరకు అన్ని సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. ఆదివారం కూడా క్రెడాయ్ ప్రాపర్టీ షో అందుబాటులో ఉంటుందన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ.. ఇంత మంచి ప్రాపర్టీ షోను ఖమ్మంలో ఏర్పాటు చేసిన క్రెడాయ్ నిర్వాహకులను అభినందించారు. భవిష్యత్తులో ఖమ్మం హైదరాబాద్‌కు దీటుగా తయారు కానుందన్నారు. అందులో క్రెడాయ్ ప్రతినిధులు, ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. అనంతరం ముఖ్య అతిథులు స్టాళ్లను పరిశీలించారు.



క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న అతిథులు

60 స్టాళ్ల ఏర్పాటు

ప్రాపర్టీ షోలో ఖమ్మంతో పాటు హైదరాబాద్‌కు చెందిన అనేక ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, హౌజింగ్, ఓపెన్ ప్లాట్లు, విల్లాలు, అపార్టుమెంట్ ప్రాజెక్టులకు సంబంధించిన అనేక కంపెనీలు 60 స్టాళ్లు ఏర్పాటు చేశాయి. అర్హులైన కొనుగోలుదారులకు రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకర్లు స్టాళ్లు నిర్వహించారు. నిర్వాహకులు గంట గంటకూ డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రాపర్టీ షోలో యూనియన్ బ్యాంక్ రీజనల్ డీజీఎం హనుమంతురెడ్డి, ఎస్‌బీఐ డీజీఎం కుమార్‌సిన్హా, కార్పొరేటర్లు, క్రెడాయ్ ప్రతినిధులుపెద్ది కేశవరావు, చెరుకుమల్లి వెంకటేశ్వర్లు, వేములపల్లి నగేష్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. మొదటి రోజు సుమారు 5వేల మందికి పైనే జనం ప్రాపర్టీ షోను తిలకించారు.

పగలు ప్రచారాలు..
రాత్రి మంతనాలు

(5వ పేజీ తరువాయి)

ప్రచారం సాగుతోంది. దీంతో అనేక పంచాయతీల్లో ఉదయం ఒక పార్టీలో ఉన్న నాయకులు, ఓటర్లు సాయంత్రానికి పార్టీ మారుతున్నారు. కొందరు కుటుంబాలను, కులాలను కూడా చూపుతూ తమ మద్దతు తెలపాలని వేడుకుంటున్నారు. పల్లెల్లో రాత్రి వేళల్లో సైతం పంచాయతీ పోరు వేడివేడిగా ఉంటుంది.

● **ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పార్టీలు**

పంచాయతీ పోరును వివిధ రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గత పంచాయతీ పాలకవర్గాల్లో బీఆర్ఎస్ మద్దతుతోనే ఎక్కువ మంది సర్పంచులుగా గెలుపొందారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ ఉండడం.. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలకు, డీసీసీ అధ్యక్షులకు, జిల్లా, మండల నేతలకు బాధ్యతలు అప్పగించారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు పంచాయతీల పోరుపై ప్రత్యేక దృష్టి సారించారు. పల్లెల్లో ప్రజాప్రతినిధులు ఉంటే పార్టీకి పట్టు ఉంటుందని, మరోసారి ఎన్నికల్లో విజయం సులువవుతుందని తెలుపుతూ.. ప్రతీచోట కాంగ్రెస్ విజయం సాధించాలని సూచిస్తున్నారు. మరోవైపు.. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. దీంతో నేతలంతా తమ పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలంటూ ఎన్నికల వ్యూహాలను చెబుతున్నారు. ఎలా వెళితే విజయం సాధించవచ్చో తెలిపి ప్రచారాలు చేసుకోవాలని సూచిస్తున్నారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. కొంతమేర ఆర్థికంగానూ ఆదుకుంటామని హామీలు ఇస్తున్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ కూడా పల్లెలో పట్టు బిగించడం ద్వారా వచ్చే ఎన్నికల్లో విజయాలు తేలికగా ఉంటాయని తెలుపుతూ.. స్థానిక నేతలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ పంచాయతీ పోరులో భాగస్వాములవుతున్నారు. మొత్తమ్మీద అధికార, ప్రతిపక్ష పార్టీలు పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో.. పల్లెల్లో పోరు మరింతగా వేడెక్కనుంది.

పంచాయతీ బరి.. భవితకు గురి

(5వ పేజీ తరువాయి)

పేరొందిన చేకూరి కాశయ్య కొత్తగూడెం నియోజకవర్గం నుంచి తెలంగాణ ప్రజాసమితి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రాతినిధ్యం వహించి కొత్తగూడెం సమితి ప్రెసిడెంట్‌గానే గెలుపొంది.. ఆ తర్వాత ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మధిర ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండబాల కోటేశ్వర్‌రావు సైతం తొలుత వైరా మండలం కొండగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా తదనంతరం వైరా మండల సమితి ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఇల్లెందు నియోజకవర్గంలో ఐదుసార్లు ఎంఎల్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన గుమ్మడి నర్సయ్య రాజకీయ ప్రస్థానాన్ని సైతం సర్పంచ్‌గానే ప్రారంభమైంది. గుమ్మడి నర్సయ్య తొలుత సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామ పంచాయతీకి 1981లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన సర్పంచ్‌గా పదవీ కాలం ముగియక ముందే 1983లో జరిగిన ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఐదుసార్లు గెలుపొందిన ఎమ్మెల్యేగా ప్రత్యేక గుర్తింపు పొందారు. అదే విధంగా భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో 1999, 2004, 2014లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడు పర్యాయాలు సీపీఎం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సున్నం రాజయ్య ప్రస్థానం కూడా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గానే ప్రారంభం కావడం గమనార్హం. ఆయన వరరామచంద్రాపురం మండలం చిన్నమట్టపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా తొలుత ఎన్నికయ్యారు. అనంతరం ఆయనకు మూడుసార్లు ఎమ్మెల్యే పదవులు లభించాయి. సీపీఎం పార్టీకే చెందిన కుంజా బుజ్జి భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో వరుసగా మూడు పర్యాయాలు విజయాలు సాధించి.. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చరిత్రకెక్కారు. కుంజా బుజ్జి సైతం తొలుత వరరామచంద్రాపురం మండలం రామవరం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1985, 1989, 1994లో భద్రాచలం ఎమ్మెల్యేగా వరుస విజయాలు నమోదు చేశారు. అలాగే సీపీఐలో కొనసాగిన కాలంలో సోడె రామయ్య మూడు పర్యాయాలు కమ్యూనిస్టు పార్టీ నుంచి భద్రాచలం ఎంపీగా గెలుపొంది సేవలందించారు. సోడే రామయ్య సైతం కూనవరం మండలం కొండ్రాజిపేట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, కూనవరం సమితి ప్రెసిడెంట్‌గా గెలుపొందడం ద్వారా తదనంతరం కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మూడుసార్లు ఎంపీగా విజయాలు సాధించారు. ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన వాణిరమణారావు సైతం తొలుత భద్రాచలం సమితి ప్రెసిడెంట్‌గా, తదనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఇల్లెందు నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన కోరం కనకయ్య రాజకీయ ప్రస్థానం సహకార బ్యాంకు సింగిల్ విండో ఎన్నికల ద్వారానే ప్రారంభమైంది. డైరెక్టర్‌గా గెలుపొందిన కోరం కనకయ్య ఇల్లెందు నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా, టేకులపల్లి జడ్పీటీసీగా ఒక పర్యాయం గెలుపొంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా పరిషత్‌కు తొలి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లాలో ఇలా చాలా మంది స్థానిక సంస్థల ఎన్నికలతో రాజకీయాల్లోకి ప్రవేశించి.. ఆ తర్వాత ప్రముఖులుగా వెలుగొందారు.

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల పురోగతి

రఘునాథపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుమ్మల యుగంధర్ అన్నారు. శనివారం రాత్రి రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో రోడ్‌షో నిర్వహించారు. మండల పరిధిలోని చింతగుర్తి, గణేశ్వరం, చెరువుకొమ్ము తండా పంచాయతీల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని ఎన్నికల వరకే రాజకీయాలు అని ఆ తరువాత రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలం ఎంతో అభివృద్ధి సాధించిందని రానున్న రోజుల్లో మండంలో మరెన్నో నూతన ప్రాజెక్టులు రానున్నాయన్నారు. మెడికల్ కాలేజీ, స్వామినారాయణ విద్యా సంస్థలు, ఇస్కాన్ మందిరం తదితర ఎన్నో సంస్థలు ముందుకు రానున్నాయన్నారు. మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాధాకిషోర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతగుర్తిలోని రోడ్‌షోలో మాట్లాడుతున్న యుగంధర్

బీఆర్ఎస్ హయాంలోనే పల్లెల అభివృద్ధి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

రఘునాథపాలెం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు తీసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ శనివారం ఆయన మంచుకొండ, పంగిడి, ఈర్లపూడి, రాజ్యాతండా, విద్యాతండా, పరికలబోడు తండా, జింకలతండా, బూడిదంపాడు, మంచుకొండ, పువ్వాడ నగర్, శివాయిగుడెం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెరువుల పునరుద్ధరించి భూగర్భ జలాలను పెంపొందించారని, ప్రతి పల్లెకు ప్రకృతి వనాలను ఏర్పాటుచేసి అందమైన పూల మొక్కలను పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రామాల్లో మనిషి చనిపోతే కర్మకాండలు చేసేందుకు సరైన శ్మశాన వాటికలు లేవని, గ్రామాల్లోని సమస్యలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతీ గ్రామంలో వైకుంఠధామాలను నిర్మించారన్నారు. మండలంలో అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలిపించుకొని బీఆర్ఎస్ పార్టీ బలాన్ని నిరూపించుకోవాలని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పలు గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు సీపీఎం, సీపీఐలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్, మాజీ ఎంపీపీ మాకోతు శాలత, తారాచంద్, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, సమాం (ఖమ్మం నగర కార్యదర్శి షేక్ జానీమియా, సీపీఎం మండల పార్టీ కార్యదర్శి నవీనెడ్డి, పగడాల మల్లేశం, నగర కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పంగిడిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

విద్యార్థిని బడికి పంపాలని టీచర్ల ధర్నా

విద్యార్థులతో కలిసి బాలుడి ఇంటి ఎదుట నిరసన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో ఘటన

దుమ్ముగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని బడికి రెగ్యులర్‌గా పంపాలని కోరుతూ నిమ్మలగూడెం గిరిజన పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్లు, విద్యార్థులు శనివారం బాలుడి ఇంటి ఎదుట ధర్నా చేశారు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని నిమ్మలగూడెంలో శనివారం జరిగింది. నిమ్మలగూడెం గ్రామానికి చెందిన నక్క మనోవరుణ్ నిమ్మలగూడెం గిరిజన పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. అతడు కొద్దిరోజులుగా పాఠశాలకు సరిగ్గా రాకపోవడం... వచ్చినా తప్పించుకొని వెంటనే తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నాడు. అతడిని రెగ్యులర్‌గా బడికి పంపాలని తల్లిదండ్రులకు పలుమార్లు సమాచారమిచ్చినా వారు స్పందించలేదు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థి ఇంటి ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. సోమవారం నుంచి తప్పనిసరిగా విద్యార్థిని బడికి పంపుతామని బాలుడి తల్లిదండ్రులు హామీ ఇవ్వడంతో వారు తమ నిరసన విరమించారు. ప్రతీ చిన్నారి విద్యాహక్కును పరిరక్షించడం, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అందించడం తమ బాధ్యతని, అది తెలియజెప్పడం కోసమే తాము ఇలా వినూత్నంగా నిరసనకు దిగామని హెచ్‌ఎం బి.రవి తెలిపారు. ఈ నిరసనలో టీచర్ ఎ.రుక్మిణి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థి మనోవరుణ్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న టీచర్లు, విద్యార్థులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

టౌన్ ఏసీపీ రమణమూర్తి


ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్‌గా అరెస్ట్ చేస్తామని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేసే సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపో వద్దని టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రారంభమైన ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ పేరుతో నిర్వహిస్తున్న సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..మీ వ్యక్తిగత సమాచారాన్ని, ముఖ్యంగా పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు, ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అపరిచిత లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఫోన్‌ద్వారా వచ్చిన అటాచ్‌మెంట్‌లను తెరవవద్దని సూచించారు. డబ్బును బదిలీ చేయమని, నగదు తీసుకుని ఇవ్వమని కోరే ఎటువంటి అభ్యర్థనలను విశ్వసించవద్దని పేర్కొన్నారు. మీరు ఏదైనా మోసానికి గురైనట్లు భావిస్తే, వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

ముత్యాల కవచాలంకారంలో జమలాపురం శ్రీవారు

ఎర్రుపాలెం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయలో శనివారం అర్చకులు సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాలకవచాన్ని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. శనివారం కావడంతో ఆలయలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ సిబ్బంది ఉచితంగా అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, ముఖ్య అర్చకులు దేవాలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఓట్ల సంకటం..!

గ్రామాల్లో తక్కువగా పోస్టల్ బ్యాలెట్లు
లెక్కింపుల్లో ఓటు బహిర్గతం
అవుతుందని ఆందోళన



ఇల్లెందు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకునే ఉద్యోగులు, ఉపాధ్యాయులు తక్కువ సంఖ్యలో ఉండటం వలన ఉద్యోగ వర్గాల్లో ఆందోళన నెలకొంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం వలన ఎవరు ఎవరికి ఓటు వేస్తారో వెల్లడయ్యే అవకాశాలు ఉండవు. ఐతే గ్రామ పంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల్లో ఆయా గ్రామాల పరిధిలో ఉండే ఉద్యోగులు, ఉపాధ్యాయులు తక్కువ సంఖ్యలో ఉండటం తక్కువ మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవడం వలన తాము ఎవరికి ఓటు వేస్తామో బహిర్గతమయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతుంది. కొన్ని గ్రామ పంచాయతీల్లో పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఒక్కరో ఇద్దరో ఉంటారు. తమ ఓటు హక్కును వారు పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు సంబంధిత గ్రామపంచాయతీ ఎన్నికల అధికారులకు దరఖాస్తు చేసుకుని బ్యాలెట్ పత్రాన్ని పొంది తమకు నచ్చిన వ్యక్తికి సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల పదవులకు పెన్నుతో టిక్ చేయాల్సి ఉంటుంది. వాటిని పోలింగ్‌కు ముందె సంబంధిత గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఓట్ల లెక్కింపు సమయంలో ఆ పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించడం వలన ఆ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎవరికి ఓటు వేశారో బహిర్గతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండటం వలన తాము పార్టీ నాయకులకు, పోటీలో ఉన్న అభ్యర్థులకు తాము ఎవరికి ఓటు వేశామన్నది వెల్లడి కావడం వలన ఆ ఉద్యోగులపై కక్షలు పెంచుకునే అవకాశం ఉం దని ఆందోళన చెందుతున్నారు. తక్కువగా ఉన్న పోస్టల్ బ్యాలెట్‌లను ఏ ఉద్యోగి, ఉపాధ్యాయుడు వినియోగించుకున్నాడో స్పష్టంగా వెల్లడి కావడం తో తమ ఓటు రహస్యంగా ఉండే ఆస్కారం లేదని వాపోతున్నారు.

గతంలో కొన్ని గ్రామాల్లో ఒకరిద్దరు పోస్టల్ బ్యాలెట్‌లు వినియోగించుకోవడం వల్ల ఓటు రహస్యం బహిర్గతమై ఓటు పొందని వారి నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చిందని తెలిపారు. అలాగే ఓ రాజకీయ పార్టీ నాయకులకు చాలాకాలం టార్గెట్‌గా మారాల్సి వచ్చిందని కొందరు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేశారు. పోస్టల్ బ్యాలెట్‌లను సైతం సాధారణంగా ఓటు హక్కు వినియోగించుకునే బ్యాలెట్ బాక్సుల్లోనే వేస్తున్న బ్యాలెట్ పత్రాలతో పాటు పోస్టల్ బ్యాలెట్‌లను కూడా వేయడం ద్వారా ఓటు రహస్యాన్ని కాపాడేందుకు అవకాశం ఉంటుందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అలా వీలుకాని పక్షంలో ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించడం వల్ల గ్రామ పంచాయతీల ఎన్నికల ఫలితాలను ఒకటి రెండు ఓట్ల తేడాతో ప్రభావితం చేసే పరిణామాలు ఉండటంతో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని భావిస్తున్నవారు ఆందోళనలో కూరుకుపోయారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో రాజకీయ కక్షలు, నామినేషన్‌ల దాఖలు సమయంలోనే ఘర్షణలు, బెదిరింపులు, దాడులు జరగడంతో రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో పోస్టల్ బ్యాలెట్ల వినియోగదారులు ఆందోళన చెందాల్సి వస్తుందని ఉపాధ్యాయ సంఘాలు సైతం ఆందోళన చెందుతున్నాయి. ఎన్నికల అధికారులు ఈ పరిణామాలను గమనంలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ బహిర్గతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఓటు రహస్యాన్ని కాపాడాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

91 ఏళ్ల వయసులో..
తగ్గేదే లేదంటున్న 'రాయల'

ముదిగొండ మండలం వెంకటాపురం
సర్పంచ్ అభ్యర్థిగా పోటీ
ప్రజల సంక్షేమం కోసమేనంటూ
స్పష్టీకరణ



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న రాయల వెంకటేశ్వర్లు (ఫైల్)

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / ముదిగొండ, డిసెంబరు 6 : 22 ఏళ్ల వయసులో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన వయసు ఇప్పుడు 91ఏళ్లు. ఇప్పటికీ రాజకీయమంటే సై అంటున్నారు. వయసు ఓ లెక్కకాదు.. ప్రజా సంక్షేమం, గ్రామ అభివృద్ధే తనకు ముఖ్యమంటూ ఈ తరం రాజకీయ నాయకులకు సవాల్ విసురుతూ సర్పంచ్ బరిలో నిలిచారు. ఆయనే ఖమ్మం జిల్లా సీపీఎం సీనియర్ నేతల్లో ఒకరైన ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రాయల వెంకటేశ్వర్లు. తన కుమారుడు రాయల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో ఉన్నా.. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా.. తన పార్టీ తనదే.. తన సిద్ధాంతం తనదే అంటూ కాంగ్రెస్ అభ్యర్థి కందుల బాలచందర్‌పై పోటీకి నిలిచారు. కుమారుడు రాయల నాగేశ్వరరావు పోటీ చేయొద్దని వారించినా.. వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయకుండా సై అంటే సై అంటున్నారు. మొత్తం 1,500 ఓట్లున్న ఈ గ్రామపంచాయతీ జనరల్‌కు రిజర్వు కాగా.. ఈనెల 14వ తేదీన రెండో విడతలో పోలింగ్ జరగనుంది. గతసారి పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కూడా సీపీఎం తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన రాయల వెంకటేశ్వర్లు.. నాటి బీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. ఈసారి కూడా ఆ పంచాయతీ జనరల్ కావటంతో వెంకటేశ్వర్లు మొదట పోటీకి అంతగా ఆసక్తి చూపలేదు. కానీ సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు పోటీ చేయాలని కోరటంతో.. నామినేషన్ వేసి ప్రజల్లోకి వెళుతున్నారు.

1959లో వెంకటాపురం గ్రామం నుంచి 22ఏళ్ల వయస్సులో రాజకీయాల్లోకి వచ్చారు వెంకటేశ్వర్లు. ఆ తర్వాత గ్రామంలో ఘర్షణల కారణంగా రెండు విడతలు ఎన్నికలు జరగలేదు. ఆ సమయంలో వెంకటాపురం, ముదిగొండ గ్రామ పంచాయతీలో కలిసి ఉన్నప్పటికీ రెండు వేర్వేరు గ్రామ పంచాయతీలుగా విడిపోయేంత వరకు 30ఏళ్ల పాటు ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా పనిచేశారు.

ప్రజల సంక్షేమం కోసమే పోటీ
: రాయల వెంకటేశ్వర్లు



గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యం, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచాను. గ్రామస్థులు కూడా ఈ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలని కోరారు. వారి సహకారంతోనే వయసు పైబడినా మళ్లీ పోటీకి దిగాను. సీపీఎం బలపరిచిన అభ్యర్థినైన నాకు బీఆర్ఎస్, టీడీపీ మద్దతు ప్రకటించాయి. ఈ ఎన్నికల్లో గెలుస్తాననే నమ్మకం ఉంది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీ!

ఇల్లెందు మండలంలో ప్రత్యర్థి పార్టీల మధ్య ఒప్పందం
ఏకగ్రీవం దిశగా రెండు పంచాయతీలు..
అధికారిక ప్రకటనే తరువాయి



ఇల్లెందు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో ఉప్పునిప్పుగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో మాత్రం దోస్తీ కట్టాయి. ఆయా పార్టీల నాయకుల మధ్య కుదిరిన అవగాహణతో ఇల్లెందు మండలంలోని సుభాష్‌నగర్, ధనియాలపాడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం వైపు సాగుతున్నాయి. సుభాష్‌నగర్‌లో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ అభ్యర్థి వల్లాల మంగమ్మను సర్పంచ్‌గా, బీఆర్ఎస్‌కు చెందిన కొలిపాక కవితను ఉపసర్పంచ్‌గా ఎన్నుకోవడంతో పాటు వార్డు సభ్యుల పదవులను కూడా పంచుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ మేరకే నామినేషన్లు దాఖలు చేయడంతో ఈ పంచాయతీలో ఎన్నిక ఏకగ్రీవం కావడం ఖాయమైంది. అదేవిధంగా ధనియాలపాడు గ్రామ పంచాయతీలో కాంగ్రెస్‌కు చెందిన ననప సావిత్రిని సర్పంచ్‌గా, బీఆర్ఎస్‌కు చెందిన అంగోతు అంజనేయులును ఉపసర్పంచ్‌గా ఎన్నుకోవాలని, వార్డు స్థానాలను కూడా పంచుకోవాలని ఒప్పందానికి వచ్చిన స్థానిక నాయకులు అందుకు అనుగుణంగా నామినేషన్లు దాఖలు చేయించారు. దీంతో ఇక్కడ కూడా ఏకగ్రీవం సాధ్యమైంది. అధికారులు ఈ రెండు గ్రామ పంచాయతీల ఏకగ్రీవంపై అధికారికంగా ప్రకటించడమే మిగిలింది.

'పోస్టల్ బ్యాలెట్'ను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది తమ ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల విధులు నిర్వహించే ఓటర్లకు, అత్యవసర సేవల్లో పనిచేసే ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. దీనికోసం పోస్టల్ ఓటింగ్ సెంటర్, ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ సంబంధిత మండలాల ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడత పోలింగ్ జరిగే గ్రామాల్లో ఓటుహక్కు ఉండి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డిసెంబర్ 8న, రెండవ విడతలో పోలింగ్ జరిగే గ్రామాల్లో ఓటుహక్కు ఉండి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డిసెంబర్ 12న, మూడవ విడత పోలింగ్ జరిగే గ్రామాల్లో ఓటుహక్కు ఉండి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డిసెంబర్ 15న ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలయ్యే వరకు కోడ్ అమలు

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశ పోలింగ్‌తో పాటు, రెండవ దశ పోలింగ్ పూర్తయిన తరువాత కూడా సంబంధిత గ్రామాలు, మండలాల్లో ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంటుందన్నారు. మూడో దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి తొలగిపోతుందన్నారు. మొదటి, రెండవ దశలో ఎన్నికైన అభ్యర్థులు, ఇతరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించ వద్దని కలెక్టర్ తెలిపారు. ఏకగ్రీవమైన గ్రామపంచాయతీల్లో సైతం ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎన్నికలకు దూరమయ్యేలా చర్యలు తీసుకుంటామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

గద్దర్ ఆశయాల కోసమే..

సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల



మాట్లాడుతున్న సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల

ఇల్లెందుటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల కోసం జీవితాంతం పనిచేసిన గద్దర్ ఆశయాల సాధన కోసమే నిరంతరం పని చేస్తున్నానని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల స్పష్టం చేశారు. శనివారం ఇల్లెందులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రాంతంకు వెళ్లినా గద్దర్ అభిమానులతోనే ఉంటూ స్థానిక ప్రజలతో మమేకం అవుతున్నానని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సంపూర్ణ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కష్టాలను తీర్చే వారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటే ప్రజల వెన్నంటి ఉంటారని పేర్కొన్నారు. ఓటుహక్కును నిజాయతీగా ఉపయోగించుకోవాలని ప్రజలకు హితవు పలికారు. ఓటును అమ్ముకోవద్దని హక్కు కల్పించిన అంబేద్కరే చెప్పారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 524మంది సాంస్కృతిక సారధుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు వివరించారు. సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించామని తెలిపారు. సాంస్కృతిక సారధులకు ప్రతినెల వేతనాలు అందిస్తున్నామని వారికి ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రకటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గోచికొండ సత్యనారాయణ, మడుగు వెంకట లక్ష్మి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన మైనర్లు

చంద్రుగొండ, డిసెంబరు 6: చంద్రుగొండ శివారు అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అయ్యన్నపాలెం వెళుతుండగా చంద్రుగొండ అయ్యన్నపాలెం గ్రామాల మధ్యలోని గండ్రాయికుంట కట్టపైన ఇద్దరు బాలురలు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని సోదా చేయగా గంజాయితో పాటు సేవించటానికి వినియోగించే వస్తువులు లభ్యమయ్యాయి. దాంతో ఆ మైనర్లను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించటంతో పాటు టాస్క్‌ఫోర్స్ విభాగంలోని పై అధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా మైనర్లకు గంజాయి సరఫరా చేసిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిసింది.

వృద్ధులను ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

బూర్గంపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వృద్ధులను డీసీఎం వ్యాన్ ఢీకొట్టిన సంఘటన శనివారం అంజనాపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... బూర్గంపాడు మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన బాణోత్ సేవ్యా(65), అతని బంధువు భూక్యా పింపా అనే ఇరువురు వృద్ధులు కలిసి శనివారం రాత్రి సమయంలో గ్రామంలో రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి గ్యాస్ సిలెండర్లతో వచ్చిన వ్యాన్ సిలెండర్‌లు అన్‌లోడ్ చేసి సారపాక వైపునకు వెళ్తుండగా రోడ్డు దాటుతున్న ఆ వృద్ధులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సేవ్యా అనే వృద్ధుడు చికిత్స పొం దుతూ మృతిచెందాడు. పింపా అనే వృద్ధురాలు చికిత్స పొందుతుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

బోనకల్‌లో రెండు ఇళ్లల్లో చోరీ

బోనకల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో శుక్రవారం అర్ధరాత్రి రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే రైల్వే సబ్‌స్టేషన్ సమీపంలో గల పెద్దపంగు అశోక్ కుమార్, చింతల కొండలరావులు వేరే ప్రాంతంలో ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లారు. ఇంటికి తాళాలు వేసి ఉండటాన్ని గమనించిన అగంతకులు ఇంటి తాళాలు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అశోక్‌కుమార్ ఇంట్లో ఉన్న బీరువా నుంచి తులం బంగారం, 12 తులాల వెండి ఆభరణాలను అపహరించారు. కొండలు ఇంట్లో కూడా బీరువా నుంచి వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎస్ఐ పొదిలి వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



బాణోత్ వాల్య (ఫైల్)

కూసుమంచి డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలేరు జలాశయంలో చేపల వేటకు వెళ్లి ఎర్రగడ్డతండాకు చెందిన బాణోత్ వాల్య(60) అనే మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం సాయంత్రం పాలేరుజలాశయంలో చేపలవేటకు వెళ్లిన వాల్య ఇంటికి రాలేదు. దీంతో తండాలో గాలించారు. అయితే శనివారం జలాశయంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు వాల్య చేపలవలలు కాళ్లకు, చేతులకు చుట్టుకుని తేలియాడుతుండటంతో మృతదేహాన్ని బయటకుతీశారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కూతుర్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు కేజీల గంజాయి పట్టివేత

ఖమ్మంక్రైం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో కోనార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా తరలిస్తున్న ఆరు కేజీల గంజాయిని నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ అధికారులు, రైల్వే పోలీసులు కలిసి స్వాధీనం చేసుకున్నారు. ఒడిసా రాష్ట్రం, గంజం జిల్లా సునపల్లి మండలంకు చెందిన అలోక్‌ప్రధాన్ అనే యువకుడు గంజాయి తరలిస్తున్నాడని సమాచారం రావటంతో తనిఖీలు నిర్వహించి గంజాయి స్వాధానం చేసుకున్నారు. ఒడిసాలో గంజాయి సేకరించి ముంబైకి తీసుకెళుతున్న నేపథ్యంలో ఖమ్మంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అభ్యర్థి ఎవరైనా.. ఆయనదే స్వరం

42 ఏళ్లుగా పలు ఎన్నికలకు
వాయిస్ ఓవర్
ఈ పంచాయతీ ఎన్నికల్లోనూ
'మాట' అందిస్తున్న
వెంకటరామశాస్త్రి



కోవూరు వెంకటరామశాస్త్రి

భద్రాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు ఏవైనా ఆయన స్వరం లేకుండా ప్రధాన రాజకీయపక్షాలు, అభ్యర్థులు తమ ప్రచారంను నిర్వహించరంటే అతిశయోక్తి కాదు. పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థలు ఇలా ఏ ఎన్నికలు అయినా అభ్యర్థికి ఓటేసి గెలిపించాలంటూ భద్రాచలంకు చెందిన కోవూరు వెంకటరామశాస్త్రి వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఆయన దాదాపుగా ప్రధాన పార్టీలు బలపరుస్తున్న అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు తన స్వరాన్ని వాయిస్ ఓవర్‌గా అందిస్తున్నారు. ఆయన 42 ఏళ్లుగా ఎన్నికల్లో వివిధ పార్టీల అభ్యర్థులకు, స్వతంత్ర అభ్యర్థులకు తన వాయిస్ ఓవర్‌ను అందిస్తుండటం విశేషం. ఇప్పటి వరకు ఆయన ఏడు పార్లమెంట్, తొమ్మిది అసెంబ్లీ, ఏడు గ్రామపంచాయతీ ఎన్నికలకు వాయిస్ ఓవర్‌ను అందించారు.

కాగా ఈసారి నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇప్పటి వరకు వంద మంది అభ్యర్థులకు వాయిస్ ఓవర్ అందించిన పంతులుగారుగా పిలువబడే కోవూరు వెంకటరామశాస్త్రి ఆంధ్రజ్యోతికి తెలిపారు. భద్రాచలంకు చెందిన కొవ్వూరు వెంకటరామశాస్త్రి సినిమా థియేటర్‌లో అసిస్టెంట్ మేనేజరుగా పని చేస్తున్న ఆయన హాబీగా వాయస్ ఓవర్ అందిస్తుంటారు. వివిధ రకాల వ్యాపార ప్రకటనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలతో పాటు ఇతరత్రా కార్యక్రమాలకు ఇదే రీతిలో వాయస్ ఓవర్‌ను అందిస్తుంటారు. ఇక ఎన్నికల సమయం వచ్చిందంటే చాలు ఆయన స్వరం వినని భద్రాద్రి ఓటరు లేరంటే అతిశయోక్తి కాదు. 42 ఏళ్లుగా ఎన్నికల సమయం వచ్చిందంటే రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు తదితర వాటి గురించి విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు. అలాగే అధికారప్రతిపక్షాల విమర్శలు, ప్రతి విమర్శలను సైతం తనదైన శైలిలో వాయస్ ఓవర్ ద్వారా సంబంధిత పార్టీలు పేర్కొన్న విధంగా అందిస్తుంటారు.

పోలీస్‌శాఖలో హోంగార్డులు అంతర్భాగమే..

15వ బెటాలియన్ కమాండెంట్ పెదబాబు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ పెదబాబు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్న హోంగార్డులు పోలీస్ శాఖలో అంతర్భాగమేనని 15వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు అన్నారు. 63వ హోంగార్డుల రైసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని గంగారంలో 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో రైసింగ్ పరేడ్ నిర్వహించారు. ప్రజల రక్షణ, అంతర్గత భద్రతలో పోలీస్‌శాఖకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో హోంగార్డుల వ్యవస్థ ఏర్పాటైందన్నారు. అత్యవసర పరిస్థితులు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ చేస్తున్న కృషికి అదనపు బలం అందించేందుకు స్వచ్ఛంద సేవాభావంతో పనిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, హోంగార్డుల ఆఫీసర్లు పాల్గొన్నారు.

బెల్టు షాపులు రద్దు చేయాలి

కొత్తగూడెం ఈఎస్ కార్యాలయం ఎదుట
మహిళల నిరసన
ఈఎస్ జానయ్యకు వినతిపత్రం అందించిన
జూలూరుపాడు మహిళా సంఘం సభ్యులు

చుంచుపల్లి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలోని జూలూరుపాడు మండల వ్యాప్తంగా రోజు రోజుకూ పెరుగుతున్న బెల్ట్ షాపులను నియంత్రించాలని కోరుతూ బాబు క్యాంపులోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.జానయ్యకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జూలూరుపాడు మహిళా సంఘ సభ్యులు మాట్లాడుతూ మద్యం వ్యాపారాలు బెల్ట్ షాపులను ఏర్పాటు చేస్తూ వ్యాపారాన్ని పెంచుకుంటూ అధిక ఆదాయాన్ని పొందుతున్నారని ఆగ్రహించారు. విచ్చలవిడిగా బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తున్న అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనేక బెల్ట్‌షాపులు తెరుస్తూ ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా కుటుంబాలను ఛిదిమేస్తూ తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారని మండిపడ్డారు. బెల్ట్ షాపుల నియంత్రణపై చర్యలు తీసుకోనిపక్షంలో రానున్న రోజుల్లో మండల వ్యాప్తంగా ఆందోళనలు తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఈఎస్ స్పందిస్తూ... తగిన చర్యలు తీసుకుంటామని మహిళలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎస్కే. ఫరీనా, భోగ లక్ష్మీ, మంజుల, కాసింబి, నూర్జ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు

కారేపల్లి డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలో పలుగ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై మండల ఎక్సైజ్‌శాఖ అధికారులు బైడంవర్ కేసులు నమోదు చేశారు. షాపులు నిర్వహిస్తున్న వారందరినీ స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం తహసీల్దార్ ఏ.రమేష్ ఎదుట హాజరుపర్చారు. మద్యంవిక్రయాలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మట్లాడుతూ అక్రమంగా ఎవరైన మద్యం రవాణా చేసిన విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లగూడెం అటవీప్రాంతంలో చెట్లు నరికివేత

నలుగురిపై కేసు నమోదు చేసిన అటవీశాఖ అధికారులు



పోడు నరికిన ప్రాంతంలో చెట్ల మోడు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం సెక్షన్‌లోని చెన్నాపురం బీట్‌లో గాండ్లగూడెం సమీపంలో గల అటవీప్రాంతంలో దాదాపు రెండు ఎకరాల పోడు పేరులో నరికిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. ఘటపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని గాండ్లగూడెంకు చెందిన ఓవ్యక్తి కొంతమంది కూలీలను పెట్టుకుని తనకు చెందిన పోడుభూమి పక్కనే మరికొంత భూమిని ఆక్రమించుకునేందుకు పెద్దపెద్ద చెట్లను నరికివేశాడు. దీనిని గమనించిన కొందరు అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈస్థాయిలో చెట్లు నరికినా అధికారులు గుర్తించకపోవటంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఘటనపై సమాచారం అందుకున్న అటవీ అధికారులు శనివారం సంఘటన ప్రాంతానికి వెళ్లి విచారణ చేశారు. సదరు వ్యక్తితో పాటు గొడ్డళ్లతో చెట్లు నరుకుతున్న ముగ్గురిని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. పోడు నరికించిన వ్యక్తితో పాటు మరో ముగ్గురిపై కేసునమోదు చేశారు. నలుగురిపై కేసు నమోదు చేసి రూ.15,400 జరిమానా విధించినట్లు రేంజర్ మురళీ తెలిపారు. పోడు పేరుతో ఎవరు చెట్లను నరికినా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని రేంజర్ మురళీ హెచ్చరించారు.



ఏకగ్రీవానికి జై

పాలేరు నియోజవర్గంలో 16 పంచాయతీలు..

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

అత్యధిక ఏకగ్రీవాలు కాంగ్రెస్ ఖాతాలోకే



లొడిగ నీలకంతం(కొత్తూరు), హలావత్ వీరయ్య(కోక్యాతండ), భూక్యాసావిత్రి(లాల్‌సింగ్‌తండా),బొంగ నాయక్(సంధ్యాతండా),బాణోతు నాగేశ్వరరావు(పాలేరు)



చుందూరు సృజనా(పల్లెగూడెం),బత్తుల వెంకటేశ్వర్లు(ధారేడు), కిన్నెర సుజాత(పాతలింగాల), భూక్య సైదమ్మ(జోగ్గూడెం), అరెం అచ్చమ్మ(కెప్టెన్‌బంజర)



బానోత్ దీనూ(జగన్నాథతండా),ఈసం హన్మంతరావు (ఊట్కూర్), నల్లమలకీర్తి(ఎర్రగడ్డ), పద్మ(హస్నాబాద్), మూడ్ వెంకట్‌నాయక్(లక్ష్మీదేవిపల్లితండా)

కూసుమంచి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ పూర్తయింది. శనివారం రాత్రి పొద్దుపోయేవకు అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ, బరిలో ఉండే అభ్యర్థుల వివరాలు, గుర్తుల కేటాయించేందుకు అధికారులు ఉరుకులు, పరుగులు తీశారు. పాలేరు నియోజకవర్గంలో మొత్తం 134పంచాయతీలు ఉండగా 16ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 118పంచాయతీల్లోఎంతమంది ఉపసంహరించుకుంది..? ఎంతమంది బరిలో ఉంది శనివారం రాత్రి పొద్దుపోయేంతవరకు ప్రక్రియ కొనసాగుతుండటంతో ఆదివారం తేలనుంది. కూసుమంచి మండలంలో సంధ్యతండ, లాల్‌సింగ్‌తండ, పాలేరు,అజ్మీరా హీరామాన్‌తండ, కోక్యాతండ, కొత్తూరు,ఖమ్మంరూరల్ మండలంలో దారేడు, పల్లెగూడెం, నేలకొండపల్లి మండలంలో ఆజర్లగూడెం,అజయ్‌తండ, కట్టుకాచారం,తిరుమలాయపాలెం మండలంలో ఎర్రగడ్డ, తిమ్మక్కపేట,హైదర్‌సాయిపేట, లక్ష్మీదేవితండ, అస్నాబాద్ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.

బరిలో 49 మంది సర్పంచ్ అభ్యర్థులు

ఖమ్మంరూరల్:మండలంలోని 21గ్రామపంచాయతీలకు సంబందించి సర్పంచ్ అభ్యర్థుల నుంచి మొత్తం 148మంది నామినేషన్లు,వార్డు మెంబర్లుకు 574మంది నామినేషన్లు వేశారు. అందులో 29మంది సర్పంచ్‌అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురైయ్యాయి.మరికొందరు ఉపసంహరించుకున్నారు. దీంతో 49 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. వార్డు మెంబర్లుకు సంబందించి 18 మంది నామినేషన్లు తిరస్కరనకు గురికాగా మరికొందరు ఉపసంహరించుకున్నారు. దీతో 180మంది బరిలో ఉన్నారు. అయితే 21 గ్రామపంచాయతీలలో రెండు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో 19గ్రామ పంచాయతీలకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. వీరందరికి ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు.

రెండు ఏకగ్రీవాలు

మండలంలో 21గ్రామపంచాయతీలలో రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలోని పల్లెగూడెం, ధారేడు గ్రామాల్లో సీపీఐ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పల్లెగూడెంలో సర్పంచ్ అభ్యర్థి చుండురి సృజనాను, ధారేడు సర్పంచ్‌గా బత్తుల వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధారేడులో సర్పంచ్ పదవికి 3నామినేషన్లు, పల్లెగూడెం పంచాయతీకి మొత్తం 5నామినేషన్లు దాఖలయ్యాయి.గ్రామంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు తీర్మానించుకుని ఏకగ్రీవంగా ఒక్కరినే ఎన్నుకుని మిగిలిన వారిని విరమింపచేశారు. దీంతో ఆ గ్రామాలు ఏకగ్రీవ పంచాయతీలుగా మారాయి.

కాంగ్రెస్‌ఖాతాలో మరోరెండు

నేలకొండపల్లి: ఉపసంహరణలు ముగిసిన అనంతరం మండలంలో మరో రెండు గ్రామ పంచాయతీలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. మండలంలో మొత్తం 32 గ్రామ పంచాయతీలుండగా మొత్తం మూడు గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఆచార్లగూడెం సర్పంచ్‌గా కొలికపంగు ఉప్పలమ్మ, కట్టుకాసారం సర్పంచ్‌గా బాణావత్ సైదులు, అజయ్‌తండా సర్పంచ్‌గా తేజావత్ వివాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన పంచాయతీల్లో ఎక్కువ పంచాయతీలను కాంగ్రెస్ సునాయాసంగా గెలుసుకునే అవకాశాలున్నప్పటికీ, కొన్ని పంచాయతీల్లో మాత్రం నువ్వా, నేనా అన్నట్లే పోటీ ఉంది.

ఐదు పంచాయతీలు ఏకగ్రీవం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలో 40గ్రామపంచాయతీలకుగాను శనివారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 5పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అందులో తిమ్మక్కపేటలోసీపీఐఎంఎల్ మాస్‌లైన్ నుంచి రేపాకుల సుభద్ర, కాంగ్రెస్‌కు ఎర్రగడ్డలో నల్లమల కీర్తి,హైదరసాయిపేటలో బానోతు సీమ్లా, లక్ష్మీదేవిపల్లితండాలో మూడ్ వెంకట్‌నాయక్, బీఆర్ఎస్‌కు హస్నాబాద్‌లో కొవ్వూరి పద్మ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. మిగిలిన 35పంచాయతీలకు ఈనెల14న ఎన్నికలు జరగనున్నాయి. ఆయా పంచాయతీల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్,సీపీఎం, మాస్‌లైన్, న్యూడెమోక్రసీ అభ్యర్థులు బరిలో ఉన్నారు.

కామేపల్లిలో ఏకగ్రీవ పంచాయతీలు ఆరు...

కామేపల్లి: మండల వ్యాప్తంగా ఉన్న 24 పంచాయతీలలో ఆరుగ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 18పంచాయతీలకు ఎన్నికలు ఈనెల14న జరగనున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఐదుపంచాయతీలు ఏకగ్రీవం అవ్వగా, సీపీఐకి ఒకటి దక్కింది.. కామేపల్లిలోని పాత లింగాలకి కిన్నెర సుజాత, జోగ్గూడెం పంచాయతీకి భూక్య సైదమ్మ, కెప్టెన్ బంజరకు అరెంఅచ్చమ్మ,లాల్యాతండకు మాలోత్ సౌజన్య, జగన్నాథతండకి బానోత్ దీనూ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఏకగ్రీవం అయ్యారు. ఊట్కూర్ సీపీఐ సర్పంచ్‌గా ఈసం హన్మంతరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.టేకులతండా గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణలో హైడ్రామా చోటు చేసుకుంది.



మాలోత్ సౌజన్య(లాల్యతండ), సిమ్లానాయక్(హైదరసాయిపేట), సుభద్ర(తిమ్మక్కపేట)

కాంగ్రెస్ తరుపున ఇద్దరు నామినేషన్ దాఖలు చేశారు. వారితో పాటు బీఆర్ఎస్ తరుపున మరో అభ్యర్థి నామినేషన్ వేశాడు. అయితే కాంగ్రెస్ పార్టీలోని ఓ అభ్యర్థికి బీఆర్ఎస్ పార్టీఅభ్యర్థి మద్దతు తెలుపుతానని మాట్లాడుకొని నామినేషన్‌ను ఉపసంహరణచేసుకున్నాడు. కాంగ్రెస్‌పార్టీలోనే ఇద్దరు నామినేషన్లు ఉండడంతో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేతో మాట్లాడించి, భవిష్యత్తులో మంచి పదవి ఇచ్చేలా హామీ ఇచ్చారు. దీంతో ఆఅభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకునేందుకు మూడు గంటలకు వచ్చాడు. ఇది తెలిసిన బీఆర్ఎస్ అభ్యర్థి అక్కడకి వచ్చి హంగామా చేశాడు. చివరకు సమయం ముగియడంతో పోటీ అనివార్యమైంది.

సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

రఘునాథపాలెం: పంగిడి, చిమ్మపుడి, ఈర్లపుడితదితర గ్రామాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పర్యటించారు. పంగిడి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భూక్యా పోలి జామ్లాని గెలిపించాలని కోరారు.ఈకార్యక్రమంలో నియోజక వర్గ కార్యదర్శి జానిమియా,జిల్లాకార్యవర్గసభ్యులు సలాం,పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, పీట్లకృష్ణమూర్తి, బానోత్‌వీరన్న పాల్గొన్నారు.

నామినేషన్ ఉపసంహరణలో గందరగోళం

తిరుమలాయపాలెం:మండలంలోని హస్నాబాద్‌లో నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా గందరగోళం నెలకొంది. ఇక్కడ బీఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న కొవ్వూరి పద్మ, కాంగ్రెస్ మద్దతుగా పోటీలో ఉన్నారు. శనివారం ఉపసంహరణలో భాగంగా కాంగ్రెస్ మద్దతుదారులు బండారు సుజాత నామినేషన్ ఉపసంహరణ తర్వాత తిరిగి నామినేషన్ వేసేందుకు వెళ్లారు. అధికారులు ఆమె నానామినేషన్ తీసుకునేదుంకు ప్రయత్నిస్తుండగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేశారు. ఉపసంహరణ పత్రాలు సమర్పించిన అనంతరం తిరిగి మరలా పత్రాలు ఎలా తీసుకుంటారని బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. అధికారుల కొవ్వూరి పద్మను ప్రకటించారు.

పాతర్లపాడులో బీజేపీ అభ్యర్థిపై దాడి

తిరుమలాయపాలెం: మండలంలోని పాతర్లపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ బీజేపీ తరుపున పోటీ ఉన్న తమిర రజినరెడ్డిపై శనివారం సాయంత్రం దాడికి పాల్పడారు. కాంగ్రెస్ తరుపున జడల సుష్మ, బీజేపీ తరుప సమార రజినరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా నామినేషన్ కేంద్రం వద్దకు రజినిరెడ్డి వచ్చారు. ఈ నేపథ్యంలో కొంతమంది నామినేషన్ ఎందుకు దాఖలు చేశావని ఆమెపైకి గొడవకు దిగారు.సర్పంచ్ అభ్యార్థిని గ్రామస్తులు అందరు తీర్మానించిన జడాల సుష్మకు మద్దతు ప్రకటించారు. రజినిరెడ్డి పోటీలో ఉండటంతో పోటీనుంచి ఉపసంహరణ చేసుకోవాలని దాడికి దిగారు. ఈ మేరకు రజని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అంబేద్కర్ అడుగుజాడలే శిరోధార్యం



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):అంబేద్కర్ అడుగుజాడలే మనకు శిరోధార్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం లంబాడీహక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నగరంలోని సంఘం కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్రఅధ్యక్షుడు బానోతు బద్రునాయక్, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, గుంతేటి వీరభద్రం, లింగాల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఘన నివాళి

ఖమ్మంమామిళ్లగూడెం: అంబేద్కర్ 69 వర్ధంతిని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవనంలో నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్ మాజీ ప్రధానకార్యదర్శి కేతినేని హరీష్ చంద్ర మాట్లాడుతూ సమాజంలో పేదలకు, బడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందంటే, వారికి అవకాశాలు దక్కుతున్నాయంటే, రక్షణ,గౌరవం పొందుతున్నారంటే దానికి కారణం అంబేద్కర్ రాజ్యాంగమన్నారు. ఈ కార్యక్రమంలో మీగడ రామారావు బానోత్ శ్రీనివాస్ చింతనొప్పు నాగేశ్వరరావు, కొలికొండ మురళి, కామినేని బాబు, కళ్యాణం నరసింహారావు, తాళ్లూరు నారాయణరావు పాల్గొన్నారు

అంబేద్కర్ బాటలో నడుద్దాం...



నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

నేలకొండపల్లి: అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని, అంబేద్కర్ బాటలో నడుద్దామని టీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్రనాయకుడు కాసాని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో అంబేద్కర్ 69వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదాసు వెంకన్న, పగిడికత్తుల వీదయ్య, నూకల దానకర్ణ, కట్టికోల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

9న వికలాంగుల రుణ దరఖాస్తుల పరిశీలన

ఖమ్మంఅర్బన్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగుల రుణదరఖాస్తుల పరిశీలన, ఎంపిక ప్రక్రియ ఈనెల9న జరగనున్నది. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని రెండో అంతస్తులోని సమవేశ మందిరంలో ఉదయం 11గంటలకు ఈ పరిశీలన జరుగుతుందని కార్పొరేషన్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో సమయానికి హాజరు కావాలన్నారు.

బీసీ బాలుర వసతి గృహ భవనాన్ని పూర్తి చేయాలి

ఖమ్మంఅర్బన్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం ముస్తఫా నగర్‌లోని బీసీ బాయ్స్ హాస్టల్ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోకినపల్లి మస్తాన్, కె. భాను డిమాండ్ చేశారు. భవన నిర్మాణానికి మూడుకోట్లు మంజూరు చేసినా ఇంతవరకు పనులు ప్రారంభించలేదన్నారు. తక్షణం భవన నిర్మాణం పూర్తి చేయక పోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.

ఈశ్వరాచారి మృతి బాధాకరం

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి):బీసీరిజర్వేషన్ల పెంపు కోసం ఈశ్వరాచారి ఆత్మబలిదానం చేయడం బాధాకరమని బీసీసంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ అన్నారు. శనివారం జరిగిన సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లపట్ల ప్రభుత్వ వైఖరిపై ఆందోళన చెందిన ఈశ్వరాచారి ఆత్మబలిదానం చేసుకోవడం జరిగిందని అన్నారు. ఈసమావేశంలో బీసీ సంఘాలనాయకులు బొమ్మ రాజేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, కత్తి నెహ్రూ పాల్గొన్నారు.

ముగిసిన గ్లోబల్ విస్టా ఉడాన్ క్రీడోత్సవాలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న పాఠశాల అధినేత మల్లెంపాటి శ్రీధర్

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో మూడురోజులుగా జరిగిన శ్రీచైతన్య గ్లోబల్ విస్టా పాఠశాల ఉడాన్ ప్లాటోపియా క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. పోటీల్లో భాగంగా విద్యార్థులకు లాన్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్విమ్మింగ్, కరాటే, చెస్, క్యారమ్స్ టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్‌క్రికెట్ పోటీలను నిర్వహించారు.విజేతలకు పాఠశాల డైరెక్టర్లు మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య బహుమతులు ప్రదానం చేశారు. ప్రతీ విద్యార్థి చిన్నతనం నుంచే క్రీడలను క్రమం తప్పకుండా ఆడాలని అన్నారు. కార్యక్రమంలో డీజీఎం చేతన్ మాధుర్, ప్రిన్సిపాల్స్ జయసుధ, టీఎల్ఎన్. శర్మ పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు ఉచిత వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలను నిర్వహిస్తున్న రాజశేఖర్

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఖమ్మంశాస్త దేవస్థానంలో శనివారం జాగృతి ఆస్పత్రి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు గుండెకు సంబంధించిన ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరాన్నినారాయణ నంబూద్రి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. జాగృతివైద్యులు రాజశేఖర్‌గౌడ్ అయ్యప్ప స్వాములకు గుండె,బీపీ,షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలను నిర్వహించి వారి ఆరోగ్యస్థితిగతులను వివరించారు. సుమారు 300 మందికి ఉచితంగా పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్‌గౌడ్,చిల్లంచర్లరాధా, సున్నా శ్రీకాంత్, ఆమంచి సురేష్ శర్మ పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): బాలికలు చదువులతో పాటు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని అన్నారు. కేటగిరిలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఖమ్మంజిల్లాకు చెందిన తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్- వైరాకి చెందిన బాలికలు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన సందర్భంగా వారిని అభినందించారు. ఈ గెలుపొందిన విద్యార్థులు 11, 12 తేదీల్లో సౌత్ జోన్ స్థాయిలో జరిగే పోటీలకు హాజరు కానున్నారని తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారిని అభినందించారు.

జూబ్లీక్లబ్ ఎన్నికల్లో నామినేషన్ల సందడి

ఖమ్మంస్పోర్ట్స్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): నగరంలోని జూబ్లీక్లబ్ ఎన్నికలకు సంబందించి నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. సెక్రెటరీ పదవికి మోతుకూరి నాగేశ్వరరావు, జొన్నలగడ్డ రవికుమార్, పోట్ల శ్రీకాంత్ నామినేషన్లు దాఖలు చేయగా జాయింట్ సెక్రెటరీ పదవికి కటకం ఉమామహేశ్వరరావు, గంగిశెట్టి వెంకటేశం నామినేషన్లు దాఖలు చేశారు. మరో 16 మంది సభ్యులు ఈసీ మెంబర్ల పదవులకు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు న్యాయవాదులు మరగాని శ్రీనివాసరావు, యడ్లపల్లి రమేష్ తెలిపారు. కాగా ఈనెల 8న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని అనంతరం అదేరోజు ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థుల తుదిజాబితా విడుదల చేస్తామని వారు తెలిపారు. ఈనెల 28న జరగనున్న ఎన్నికల్లో క్లబ్‌లో సభ్యత్వం ఉన్న 2827 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వారు తెలిపారు.

మద్యం తాగి పారిశుధ్య విధులకు?

- డ్రైవర్లపై కొరవడిన పర్యవేక్షణ
- వాహనాల మెకానిక్‌పై ఓ డ్రైవర్ దాడికి యత్నం

ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): కేఎంసీలో పారిధ్య విభాగంలో పర్యవేక్షణ కొరవడుతోంది..ఫలితంగా కొందరు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారు. ఫలితంగా ఇటీవల కొన్ని ప్రమాదాలు జరగటంతో పాటు, ఇతర ఉద్యోగులపై దాడులకు పాల్పడుతున్నారు. నగరంలో పారిశుధ్య బాధ్యతలను డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, పారిశుధ్య పర్యవేక్షకుడు, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ వరకు పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రతి అధికారికి కేఎంసీ నుంచి ఒక్కోవాహనాన్ని విడివిడిగా కేటాయించారు.అయినాపారిశుధ్యం మెరుగుపడక పోగా నిత్యం ఏదో ఒక డివిజన్‌లో అంతర్గత విబేదాలు బయటపడుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

పారిశుధ్య కార్మికుల హాజరు నుంచి వారు పనిచేసే సమయంలో ఉండే విధానంపై పారిశుధ్యపర్యవేక్షణా అధికారులు దృష్టి సారించటంలేదు. మూడు నెలల క్రితం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలోనే ఒక పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదానికి గురై మరణించారు. గాయాలైన డ్రైవర్లు, కార్మికులు ఎందరో ఉంటున్నారు. ప్రమాదాలకు గురైన వారిలో కొంతమంది మద్యం సేవించినట్లు విమర్శలు వెలువడ్డాయి. గతంలో పనిచేసిన అధికారులు మాత్రం నేరుగా డ్రైవర్లు, పారిశుధ్య కార్మికుల వద్దకు వెళ్లి మాట్లాడటంతో ఎవ్వరైనా మద్యం సేవించి విధులకు హాజరైతే గుర్తించే వారు.. ఇటీవల కేఎంసీలో మాత్రం కొన్ని నెలలుగా మద్యం సేవించి పారిశుధ్య విధులకు హాజరయ్యే వారిపై నోరు మెదపటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి.

మెకానిక్ ఉద్యోగిపై దాడికి యత్నం

ఖమ్మం నగర పాలక సంస్థలో వాహనాల మెకానిక్‌పై ఓడ్రైవర్ దాడికి యత్నించిన సంఘటన చోటుచేసుకొంది. గురువారం ఉదయం విధులకు హాజరైన డ్రైవర్ తన వాహనంలో మరో డ్రైవర్‌ను తీసుకొని పారిశుధ్య పనులకు వెళ్లారు. డ్రైవర్లు కొరతతో రెండో డ్రైవర్ ఎటువెళ్లాడని వాహనాల మెకానిక్ ఆరా తీశారు. దీనిపై ప్రశ్నించారు. ఆగ్రహించిన డ్రైవర్.. మెకానిక్ ఉద్యోగిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పారిశుధ్య విభాగం అధికారులు సదరు డ్రైవర్‌ను విధుల నుంచి తత్కాలికంగా పక్కకు పెట్టారు.

పని చేయకున్నా వేతనాలు

పారిశుధ్య విభాగంలో రెగ్యూలర్ కార్మికులకు సర్వీస్ సినియారిటీ మేరకు నెలకు రూ.80వేల వరకు అందుతున్నాయి. అయితే ఆయా కార్మికులు నెలకు రూ.10వేలు ఇచ్చి ప్రైవేట్ వ్యక్తులను పనులకు కేటాయించుకుంటున్నారు. కేఎంసీ నుంచి మాత్రం పూర్తి స్థాయిలో వేతనాలు అందుతున్నాయి. 32వ డివిజన్‌లో ఓ రెగ్యులర్ కార్మికుడు విధులకు హాజరుకాకున్న అతనికి ప్రతీ నెలా హాజరు నమోదు చేసి పూర్తి స్థాయి వేతనాలు పంపిణీ చేస్తున్నారు.

మహిళలు ఐక్యంగా పోరాడాలి

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ

ఖమ్మంఅర్బన్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాదాన్ని, మనువాదాన్ని వ్యతిరేకిస్తూ మహిళలు ఐక్యంగా పోరాడాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, మహిళా లెక్చరర్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఐద్వా జాతీయ మహాసభల ప్రచారాల్లో భాగంగా ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో శనివారం మహిళల హక్కులు రాజ్యాంగ పరిరక్షణ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. బాగం అజిత అధ్యక్షతన జరిగిన ఈసెమినార్‌లో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని మరింత ముందుకు తీసుకు వస్తూ మహిళలపై మూఢాచారాలను రుద్దుతున్నారన్నారు. రాజ్యాంగంలో మార్పులు తీసుకువచ్చే యత్నాలు చేస్తూ రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టేందుకు కేంద్రం దురాలోచన చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, డివిజన్ కార్యదర్శి పత్తిపాక నాగసులోచన, తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళ

ఏకగ్రీవాల్లో పైచేయి!

(5వ పేజీ తరువాయి)

పంచాయతీలు సీపీఐ ఏకగ్రీవమయ్యాయి. దారేడులో బత్తుల వెంకటేశ్వర్లు, పల్లెగూడెంలో చుండూరు సృజన ఎన్నికయ్యారు. కూసుమంచి మండలంలో ఐదుగురు కాంగ్రెస్ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లాల్‌సింగ్‌తండాలో భూక్యా సావిత్రి, కొత్తూరులో లొడిగ నీలకంఠం, పాలేరులో బానోతు నాగేశ్వరరావు, సంధ్యాతండాలో బొంగ నాయక్, కోక్యాతండాలో హలావత్ వీరయ్య, అజ్మీరాహిరామాన్ తండాలో అజ్మీరా ఆమని ఎన్నికయ్యారు. ముదిగొండ మండలంలో వల్లభి పంచాయతీ ఏకగ్రీవం కాగా.. బిచ్చాల భిక్షం ఎన్నికయ్యారు. తిరుమలాయపాలెంలో ఐదు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అందులో తిమ్మక్కపేటలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నుంచి రేపాకుల సుభద్ర, కాంగ్రెస్ అభ్యర్థిగా ఎర్రగడ్డలో నల్లమల కీర్తి, హైదరసాయిపేటలో బానోతు సీమ్లా, లక్ష్మీదేవిపల్లితండాలో మూడ్ వెంకట్‌నాయక్, బీఆర్ఎస్‌కు హస్నాబాద్‌లో కొవ్వూరి పద్మ ఎన్నికయ్యారు.

మూడో విడత ఉపసంహరణకు ప్రయత్నాలు

మూడో విడత జరుగుతున్న ఎన్నికల్లో ఏకగ్రీవాల కోసం పలు గ్రామాల్లో నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కొంతమంది గ్రామాల్లో యువత ఏకగ్రీవాలకు అంగీకరించడంలేదు. గ్రామాల్లో ఎన్నికలు జరగాల్సిందేనని నాయకులు చెబితే ఉపసంహరించుకోమంటూ చెప్పకుండా వెళ్లిపోతున్నారు. దీంతో అక్కడ పోటీ అనివార్యమవుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కొన్ని గ్రామాల్లో సయోధ్య కుదుర్చుకుంటున్నాయి. పోటీకి దిగితే డబ్బులు ఖర్చులు పెట్టాల్సి ఉంటుందని అధికారపార్టీ కాంగ్రెస్‌కు సర్పంచ్ ఇచ్చి ఉపసర్పంచ్ పదవిని బీఆర్ఎస్ తీసుకుంటోంది. అయితే మూడో విడతలో సత్తుపల్లి, వైరా నియోజకవర్గ మండలాలున్నాయి. అక్కడ ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు సొంత పార్టీల నాయకులు, యువత ఏకగ్రీవాలు జరిగితే గ్రామాల్లో ఎన్నికలసందడి ఉండదని, ఎన్నికలు జరగాల్సిందేనని పట్టుబడుతున్నారు. సర్పంచ్ , వార్డు పదవులకు నామినేషన్లు ఉపసంహరించుకోవాలని సూచిస్తున్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు ససేమిరా అంటూ నాయకులకు దొరక్కుండా తిరుగుతున్నారు. సెల్‌ఫోన్లను స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. దీంతో గ్రామపెద్దలంతా ఐక్యంగా ఉన్నా నామినేషన్ వేసిన వారు ఉపసంహరణకు రాకపోవడంతో కొన్నిచోట్ల పోటీ అనివార్యమవుతోంది. సత్తుపల్లి నియోజకవర్గంలో అధికారపార్టీకి రెబల్స్ అధికంగా ఉన్నారు. దీంతో అందరి దృష్టి రెబల్స్‌పైనే ఉంది.

ప్లాస్టిక్ నిషేధంపై చిత్తశుద్ధి లేదు

సీపీఐ కార్పొరేటర్ బీజీ క్లెమెంట్



ఖమ్మంకార్పొరేషన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ప్లాస్టిక్ నిషేధంపై సరైన కార్యచరణ అమలు జరగటం లేదని, పాలకవర్గ సమావేశంలో ప్లాస్టిక్ నిషేధం సాధ్యం కాదని మాట్లాడిన అధికార పార్టీ కార్పొరేటర్లు ఇప్పుడు ప్లాస్టిక్ నిషేధం పేరుతో ప్రచారం చేస్తూ ద్వంద్వనీతితో మాట్లాడుతున్నారని సీపీఐ కార్పొరేటర్ బీజీ క్లెమెంట్ ఆరోపించారు. ఈమేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్లాస్టిక్ నిషేధం పేరుతో ప్రజల్ని మభ్య పెడుతున్నారని విమర్శించారు. పాలకవర్గంలోనే సరైన నిర్ణయాన్ని తీసుకొని వాటిని ఖచ్చితంగా అమలు చేయటం ద్వారా ప్లాస్టిక్ భూతాన్ని ఖమ్మం నుంచి తరమికొట్టేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అత్యవసర పాలకవర్గ సమావేశం నిర్వహించి ప్లాస్టిక్ నియంత్రణపై నిర్దిష్టమైన గడువును ప్రకటించాలని కోరారు.

మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

సీపీఎం టూటౌన్ కార్యదర్శి విక్రమ్

ఖమ్మంఅర్బన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రతీనెలా మొదటి శనివారం నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సీపీఎం టూటౌన్ కార్యదర్శి వై.విక్రమ్,బీవీకే మేనేజర్ వై.శ్రీనివాసరావు అన్నారు. మంచికంటి హాల్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును వారు ప్రారంభించారు. కార్యక్రమంలో బోడపట్ల సుదర్శన్, పారుపల్లి అరుణ కుమారి, శివనారాయణ, వాసిరెడ్డి వీరభద్రం పి.వాసు, అఫ్జల్, పి.కృష్ణారావు, టి.వెంకట్రావు, వి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీకి ముగిసిన నామినేషన్ల పర్వం

సత్తుపల్లి నియోజకవర్గంలో భారీగా దాఖలు

- సర్పంచులకు 659, వార్డులకు 2829 నామినేషన్లు
- ఏకగ్రీవం దిశగా ఆరు పంచాయతీలు

సత్తుపల్లి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మూడో విడత పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం సాయంత్రం నామినేషన్ల గడువు ముగిసిన విషయం విదితమే. కొన్ని క్లస్టర్లలలో నామినేషన్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో శుక్రవారం రాత్రికి నామినేషన్ల లెక్క అధికారికంగా తేలింది. నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ఎన్నికలు జరగనున్న 129 గ్రామ పంచాయతీలలో సర్పంచి స్థానానికి పోటీ చేసే వారు మొత్తం 659 నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 1208 వార్డులకు గాను 2829 నామినేషన్లు దాఖలయ్యాయి. కల్లూరు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో సర్పంచి స్థానానికి 124 నామినేషన్లు, మొత్తం వార్డులకు 517 నామినేషన్లు దాఖలయ్యాయి. పెనుబల్లి మండలంలో ఎన్నికలు జరుగుతున్న 32 గ్రామ పంచాయతీల్లో సర్పంచి స్థానాలకు 158, వార్డు సభ్యుల స్థానాలకు 680 నామినేషన్లు దాఖలయ్యాయి. సత్తుపల్లి మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో సర్పంచి అభ్యర్థులు 106 నామినేషన్లు వార్డులకు 524 దాఖలు చేశారు. తల్లాడ మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో సర్పంచి స్థానాలకు 145, వార్డు సభ్యుల స్థానాలకు 587 నామినేషన్లు దాఖలయ్యాయి. వేంసూరు మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో సర్పంచి స్థానాలకు 126, వార్డు సభ్యుల పదవికి 521 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఏకగ్రీవం దిశగా ఆరు పంచాయతీలు

నియోజకవర్గంలో మొత్తం 129 గ్రామ పంచాయతీలకు గాను నామినేషన్ల దాఖలు తుది గడువు వరకూ ఆరు పంచాయతీల్లో సర్పంచి స్థానాలకు ఒక్కరే నామినేషన్లు దాఖలు చేయడంతో ఆయా గ్రామ పంచాయతీల్లో ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశాలున్నాయి. తల్లాడ మండలం బిల్లుపాడు, బస్వాపురం పంచాయతీలు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఏర్పడింది. కల్లూరు మండలంలోని నారాయణపురం, పెనుబల్లి మండలం గంగదేవిపాడు పంచాయతీల్లో ప్రత్యర్థి వర్గం ఎవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో అక్కడ కూడా ఎన్నిక ఏకగ్రీవం కానుంది. వేంసూరు మండలం వైఎస్.బంజర, ఎర్రగుంటపాడు గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా ఏకగ్రీవం కానున్నాయి. ఏకగ్రీవ ఎన్నికను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

పలుచోట్ల సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవం

గంగదేవిపాడులో మాలోతు రాధాకృష్ణ



పెనుబల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగదేవిపాడు గ్రామపంచాయతీ ఏకగ్రీవమైంది. ఈ పంచాయతీలో సర్పంచ్ తోపాటు 10వార్డులకు ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో ఏకగ్రీవం కానుంది. గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గ్రామస్థులతో సర్పంచ్ అభ్యర్థిని కాంగ్రెస్ నుంచి, ఉపసర్పంచ్ అభ్యర్థిని బీఆర్ఎస్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకునే విధంగా నామినేషన్లు దాఖలు చేయించారు. ఈ పంచాయతీ సర్పంచ్ జనరల్‌కు రిజర్వు కాగా ఎస్టీ సామాజిక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్‌గా మాలోతు రాధాకృష్ణ లాంఛనంగా ఎన్నిక కానున్నారు. గడచిన 40సంవత్సరాలుగా ఈ గ్రామపంచాయతీ కాంగ్రెస్‌యేతర పార్టీలకు చెందిన వారే సర్పంచ్‌లుగా పనిచేశారు. ఈ గ్రామానికి చెందిన పంది వెంకటేశ్వరరావు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాగా ఇదే గ్రామానికి చెందిన వెంకట్రావ్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

గంగులనాచారం మల్కం లక్ష్మి



ఏన్కూరు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం గంగులనాచారం గ్రామపంచాయతీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ పంచాయతీ నుంచి సర్పంచ్ పదవికి ఒకే ఒక్క నామినేషన్ దాఖలయింది. దీంతో సర్పంచ్ పదవికి నామినేషన్ వేసిన మల్కం లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు తెలిపారు. దీంతోపాటు ఆ పంచాయతీలో 8వార్డులకు కూడా ఒక్కోక్క నామినేషన్ దాఖలు కావడంతో అవి కూడా ఏకగ్రీవమైనట్టు అధికారులు తెలిపారు.

వల్లభిలో బిచ్చాల భిక్షం



ముదిగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లభి గ్రామ పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ సర్పంచ్‌తోపాటు 14వార్డులు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన బిచ్చాల బిక్షం ఏకగ్రీవం కాగా 14వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. మండలంలో 25గ్రామపంచాయతీలుండగా మిగిలిన 24గ్రామపంచాయతీల్లో ఈనెల 14న ఎన్నికలు జరుగనున్నాయి. ఇదిలా ఉంటే మల్లారం, బాణాపురం, గోకినపల్లిల్లో కట్టకూరు పంచాయతీల్లో 11వార్డులు ఏకగ్రీవం అయ్యాయి.

వార్డుకు అభ్యర్థుల కరువు

తల్లాడ, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవటిమెట్ట(రెడ్డిగూడెం) గ్రామ పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డుకు అభ్యర్థులు కరువయ్యారు. గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 8వార్డులకు గాను 7వార్డులకు మాత్రమే అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డు ఎస్టీకి కేటాయించారు. ఆ గ్రామపంచాయతీ పరిధిలో ఎస్టీ జనాభ లేకపోవడంతో ఒకటో వార్డుకు నామినేషన్ వేసే అభ్యర్థులు కరువయ్యారు. 2019లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా కూడా రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని 3వార్డుకు ఎస్టీకి కేటాయించగా ఆ సమయంలో కూడా పోటీ చేసేవారు లేకపోవడంతో ఎన్నిక జరగకుండానే పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిసేవరకు ఆ వార్డు ఖాళీగానే ఉంది.



కొడవటిమెట్ట పంచాయతీ కార్యాలయం

కల్లూరు మండలంలో 31 వార్డుల ఏకగ్రీవం

కల్లూరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని 23 గ్రామ పంచాయితీలు ఉండగా, రాష్ట్ర రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి స్వగ్రామమైన నారాయణపురం గ్రామపంచాయితీలో సర్పంచు స్థానానికి ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో సర్పంచుగా గొల్లమందల వెంకటేశ్వర్లు ఎన్నిక దాదాపుగా ఖారారు అయింది. ఇక 23 గ్రామ పంచాయితీల పరిధిలో గల 214 వార్డు సభ్యుల స్థానాలకు గాను 31 వార్డుల్లో సగటున ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావటంతో అన్నీ వార్డులు దాదాపుగా ఏకగ్రీవం కానున్నాయి. మిగిలిన 183 వార్డు స్థానాలకు అభ్యర్థులు బరిలో ఉండగా 17న ఎన్నిక జరగాల్సి ఉంది.

గొల్లపూడిలో హోరాహోరీ పోరు

- బరిలో ఆరుగురు అభ్యర్థులు.. వారిలో ముగ్గురు మాజీ ప్రజాప్రతినిధులు

వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని గొల్లపూడి గ్రామపంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య పోరు హోరాహోరీ సాగుతోంది. ఓసీకి రిజర్వు అయిన ఈ పంచాయతీలో సర్పంచ్ పదవికి ఆరుగురు పోటీపడుతున్నారు. వారిలో ముగ్గురు మాజీ ప్రజాప్రతినిధులు కావడం విశేషం. గతంలో మిత్రులుగా ఉన్న వారే నేడు ప్రత్యర్థులుగా మారి తలపడుతున్నారు. ఈ ఎన్నికల్లో మాజీ సర్పంచ్‌లు మేడూరి రామారావు, బాణాల వెంకటేశ్వరరావు(బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు), వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, గోడపాటి నవీన్‌కుమార్, పోలిమెట్ల కేశవరావు, శాఖమూరి రామారావు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. సర్పంచ్ బరిలో ఉన్న ఏఎంసీ మాజీ చైర్మన్ మోహన్‌రావు సతీమణి పసుపులేటి వినోద తాజా మాజీ సర్పంచ్. 2019లో బీఆర్ఎస్ నుంచి ఆమె సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గతంలో టీడీపీ నుంచి బాణాల వెంకటేశ్వరరావు, మేడూరి రామారావు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం మేడూరి రామారావు మోహన్‌రావు, కేశవరావులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. బాణాల వెంకటేశ్వరరావు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. వీరితోపాటు నవీన్‌కుమార్, శాఖమూరి రామారావు పోటీలో ఉండడంతో ఈ ఎన్నిక రసవత్తరంగా మారింది. మిగిలిన గ్రామాల్లో ముఖాముఖీ పోటీ ఉండగా ఈ పంచాయతీలో మాత్రమే బహుముఖ పోటీ నెలకొంది.



సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వైరా ఇన్‌చార్జ్ ఏసీపీ వసుంధర



వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైరా ఇన్‌చార్జ్ ఏసీపీ వసుంధర యాదవ్ సూచించారు. శనివారం వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల్లో తనిఖీలు నిర్వహించిన అనంతరం సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. మొబైల్ ద్వారానే 80శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయని సైబర్ నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరా చేసుకొని కొందరు సైబర్ నేరాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని అందువలన అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరుపై ఏసీపీ ఆరా తీశారు. వైరా సీఐ వై.వెంకటప్రసాద్, ఎస్ఐలు పుష్పాల రామారావు, వెంపటి పవన్ పాల్గొన్నారు.

బాబోయ్ పోస్టల్ బ్యాలెట్..

- ఓటు వేసేందుకు చిరుద్యోగులు విముఖత

పెనుబల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగుల వరకు ఎన్నికల బాధ్యతలు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనవాయితీ. ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు అందజేస్తున్నారు. వీటిలో అంగన్‌వాడీ ఉద్యోగులు మండలంలో సుమారు 90మంది వరకు ఉన్నారు. వీరిలో అంగన్‌వాడీ టీచర్లుగా సుమారు 50మంది పెనుబల్లి మండలంలో పనిచేస్తున్నారు. వీరంతా ఎన్నికల విధుల్లో ఉండడంతో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ఒకరిద్దరు మాత్రమే పనిచేస్తుండడం, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎవరు ఏ పార్టీకి ఓటు వేశారనేది తేటతెల్లమవుతుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు మండలంలో తమకు ఎన్నికలు విధులు కేటాయించినట్లయితే నేరుగా ఓటుహక్కును వినియోగించుకునే అవకాశముందని తద్వారా తమ ఓటు రహస్యంగా ఉంటుందని తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చిరుద్యోగులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి తమ మండలంలో నేరుగా ఓటు వేసుకునేందుకు తమకు విధులు కేటాయించాలనికోరుతున్నారు.

ప్రాథమిక పాఠశాలకు సామగ్రి వితరణ

- స్టడీ మెటీరియల్, కంపూటర్స్, దుస్తులు, సీసీ కెమెరాలు అందించిన పీఎస్ఆర్ ట్రస్ట్

కల్లూరు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు తరపున రూ.5 లక్షల విలువగల స్టడీ మెటీరిల్ సామాగ్రి, కంప్యూటర్స్, సీసీ కెమెరాలుతో పాటుగా యూనిఫామ్ దుస్తులు, షూలు, రగ్గులు, బ్యాగులు, వాటర్ బాటిల్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత్రి పొంగులేటి మాధురి వాటిని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి నివేదిత కంపూటర్స్ సిస్టమ్స్‌ను ప్రారంభించగా, పాఠశాల హెచ్ఎం నాగమణి స్టడీ మెటీరియల్ సామాగ్రిని విద్యార్థులకు పంపిణి చేశారు. రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన నారాయణపురంలోని పేద విద్యార్థులకు ఏడాదికి సరిపడ సామాగ్రిని పీఎస్ఆర్ ట్రస్టుతరపున వితరణ చేశారు. అలాగే విద్యార్థులు పాఠశాలకు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నందున వారికి రోజు వారిగా ప్రయాణ సౌకర్య కల్పనలో భాగంగా ఆటో ట్రావెల్ సౌకర్యం కల్పించారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కూరగాయలు, మజ్జిగ కూడా అందిస్తున్నారు. తమ పాఠశాలలోని పేద విద్యార్థుల విద్యకు చేయూతనిస్తున్న పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత్రికి పాఠశాల హెచ్ఎం నాగమణితో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



కంప్యూటర్ సిస్టమ్స్ ప్రారంభిస్తున్న ఎంఈవో నివేదిత

న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో వనసమారాధన

వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల వారు శనివారం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మంలోని ఓ పార్కుకు ఈ పాఠశాల విద్యార్థులు తరలివెళ్లి వన సమారాధన జరుపుకున్నారు. కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ వనదేవతలకు పూజలు చేసి వనసమారాధనను ప్రారంభించారు. విద్యార్థులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్, ఏవో నర్సింహారావు పాల్గొన్నారు.



వనసమారాధనలో విద్యార్థులు, యాజమాన్యం

ఏకగ్రీవాల్లో పైచేయి!

(5వ పేజీ తరువాయి)

పంచాయతీలు సీపీఐ ఏకగ్రీవమయ్యాయి. దారేడులో బత్తుల వెంకటేశ్వర్లు, పల్లెగూడెంలో చుండూరు సృజన ఎన్నికయ్యారు. కూసుమంచి మండలంలో ఐదుగురు కాంగ్రెస్ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లాల్‌సింగ్‌తండాలో భూక్యా సావిత్రి, కొత్తూరులో లొడిగ నీలకంఠం, పాలేరులో బానోతు నాగేశ్వరరావు, సంధ్యాతండాలో బొంగ నాయక్, కోక్యాతండాలో హలావత్ వీరయ్య, అజ్మీరాహిరామాన్ తండాలో అజ్మీరా ఆమని ఎన్నికయ్యారు. ముదిగొండ మండలంలో వల్లభి పంచాయతీ ఏకగ్రీవం కాగా.. బిచ్చాల భిక్షం ఎన్నికయ్యారు. తిరుమలాయపాలెంలో ఐదు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అందులో తిమ్మక్కపేటలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నుంచి రేపాకుల సుభద్ర, కాంగ్రెస్ అభ్యర్థిగా ఎర్రగడ్డలో నల్లమల కీర్తి, హైదరసాయిపేటలో బానోతు సీమ్లా, లక్ష్మీదేవిపల్లితండాలో మూడ్ వెంకట్‌నాయక్, బీఆర్ఎస్‌కు హస్నాబాద్‌లో కొవ్వూరి పద్మ ఎన్నికయ్యారు.

మూడో విడత ఉపసంహరణకు ప్రయత్నాలు

మూడో విడత జరుగతున్న ఎన్నికల్లో ఏకగ్రీవాల కోసం పలు గ్రామాల్లో నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కొంతమంది గ్రామాల్లో యువత ఏకగ్రీవాలకు అంగీకరించడంలేదు. గ్రామాల్లో ఎన్నికలు జరగాల్సిందేనని నాయకులు చెబితే ఉపసంహరించుకోమంటూ చెప్పకుండా వెళ్లిపోతున్నారు. దీంతో అక్కడ పోటీ అనివార్యమవుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కొన్ని గ్రామాల్లో సయోధ్య కుదుర్చుకుంటున్నాయి. పోటీకి దిగితే డబ్బులు ఖర్చులు పెట్టాల్సి ఉంటుందని అధికారపార్టీ కాంగ్రెస్‌కు సర్పంచ్ ఇచ్చి ఉపసర్పంచ్ పదవిని బీఆర్ఎస్ తీసుకుంటోంది. అయితే మూడో విడతలో సత్తుపల్లి, వైరా నియోజకవర్గ మండలాలున్నాయి. అక్కడ ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు సొంత పార్టీల నాయకులు, యువత ఏకగ్రీవాలు జరిగితే గ్రామాల్లో ఎన్నికలసందడి ఉండదని, ఎన్నికలు జరగాల్సిందేనని పట్టుబడుతున్నారు. సర్పంచ్ , వార్డు పదవులకు నామినేషన్లు ఉపసంహరించుకోవాలని సూచిస్తున్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు ససేమిరా అంటూ నాయకులకు దొరక్కుండా తిరుగుతున్నారు. సెల్‌ఫోన్లను స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. దీంతో గ్రామపెద్దలంతా ఐక్యంగా ఉన్నా నామినేషన్ వేసిన వారు ఉపసంహరణకు రాకపోవడంతో కొన్నిచోట్ల పోటీ అనివార్యమవుతోంది. సత్తుపల్లి నియోజకవర్గంలో అధికారపార్టీకి రెబల్స్ అధికంగా ఉన్నారు. దీంతో అందరి దృష్టి రెబల్స్‌పైనే ఉంది.

విత్తన కంపెనీలు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- వైరా నియోజకవర్గస్థాయి విత్తన ఏజెంట్స్ సమావేశంలో డీఏవో పుల్లయ్య



విత్తన కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య

కొణిజర్ల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): విత్తన కంపెనీలు రైతులను ఇబ్బంది పెట్టకుండ విధిగా అగ్రిమెంట్ ఇవ్వాలని, రైతులను ఇబ్బందిపెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య కంపెనీల ఎజెంట్‌లను హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని తనికెళ్ళ రైతువేదిక నందు వైరా నియోజకవర్గస్థాయిలో విత్తన ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 10 తరువాత విత్తన కంపెనీలు రైతుల ద్వారా మొక్కజొన్నను వేపించవద్దని, ఫిబ్రవరి నుండే అధికవేడి వాతావరణం ఉండే అవకాశం ఉందని, కొత్తగా మొక్కజొన్నను వేపించవద్దని తెలిపారు. విత్తన కంపెనీ ప్రతినిధులు వారానికి ఒకసారి విత్తన మొక్కజొన్న వేసిన రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. విత్తన ఏజెంట్లు గత ఏడాదిలాగా కాకుండ ఈ సారి రైతులను ఇబ్బంది పెట్టకుండ పంటకాలం పూర్తి అయిన తర్వాత 10 రోజులలో వారికి డబ్బులు ఇవ్వాలని తెలిపారు. రైతులను మోసం చేసిన విత్తన ఏజెంట్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఏజెంట్ ఎవరి పరిధిలో ఎంత మొక్కజొన్న వేపించారో వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం తనికెళ్ళలోని రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. వైరా డివిజన్ ఏడీఏ కరణశ్రీ, మండల వ్యవసాయాధికారి బాలాజి, వైరా ఏవో మంజుఖాన్, డివిజన్ పరిధిలోని ఏఈవోలు పాల్గొన్నారు.

మధు విద్యాసంస్థల్లో ఘనంగా చిల్డ్రన్స్ డే..



వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభిస్తున్న మల్లెంపాటి వీరభద్రరావు

వైరా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధు విద్యాలయంలో శనివారం చిల్డ్రన్స్, పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను మధు విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ నీడ్స్ అకాడమీ రీజనల్ డైరెక్టర్ కిషోర్ వారణాసి మాట్లాడుతూ విద్యార్థులు విద్యను చర్చించే పద్దతుల ద్వారా నేర్చుకోవడం ద్వారా నైపుణ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మల్లెంపాటి రంజిత్, ఉపాధ్యక్షుడు మల్లెంపాటి ప్రసాద్, కోశాధికారి మల్లెంపాటి నర్మద, ప్రిన్సిపాల్ రాంబాబు, ప్రధానోపాధ్యాయులు డీవీఆర్.చారి, రాజేంద్రప్రసాద్‌బాబు, సౌజన్య పాల్గొన్నారు.

కండక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో రెగ్యూలర్ నియామకాలు లేనికారణంతోపాటు సొంతబస్సుల్లో కండక్టర్ల కొరతను అధిగమించేందుకు ఔట్‌సోర్సింగ్ పద్దతిలో కండక్టర్ల నియామకానికి సంస్థ ధరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో సత్తుపల్లి డిపో పరిధిలో 9ఖాళీ పోస్టులకు అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు ఆహ్వానించారు. కాగా జిల్లాలోని 7డిపోల పరిధిలో 63కండక్టర్ పోస్టుల భర్తీకి ఆయా డిపోలలో అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ధరఖాస్తుకు ఈనెల 7వ తేదీ ఆఖరు కాగా ఎంపికైన వారికి రూ.17,969గా వేతనం లభించనున్నట్లు సంస్థ తెలిపింది. 21-35ఏళ్ల మధ్య వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, పురుషులు 153సెం.మీ.లు, మహిళలు 147సెం.మీ.లు ఎత్తు ఉండేవారే అర్హులు కాగా మెరిట్‌ను బట్టి అవకాశాలు కల్పించబడతాయని సంస్థ తెలిపింది.

అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే పేద వర్గాల అభ్యున్నతి: ఎమ్మెల్యే



సత్తుపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

సత్తుపల్లి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఈ దేశంలో పేద వర్గాల అభ్యున్నతి అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే సాధ్యమైందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 70వ వర్ధంతి సందర్భంగా సత్తుపల్లిలోని ఆయన కాంస్య విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. దేశంలో బడుగు, బలహీనవర్గాలకు రక్షణ కల్పించిన మహనీయుడని, ప్రజల మధ్య సామాజిక సమానత్వం ఏర్పరిచేందుకు బలహీనవర్గాల రిజర్వేషన్ కోసం అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు.

శానికే గర్వకారణం.. పిల్లి కవితా మల్లిక్

అంబేద్కర్ లాంటి మేధావి ఈ దేశంలో పుట్టడం గర్వకారణమని, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు అని, భారత జాతి ఉన్నంత కాలం అంబేద్కర్‌ను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాల మల్లయోధుల అధ్యక్షుడు పిల్లి కవితా మల్లిక్ అన్నారు. అదేవిధంగా రామానగరంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు



తనికెళ్లలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కోటేశ్వరరావు

కొణిజర్ల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం మండల పరిధిలోని తనికెళ్లలో గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగం ద్వారా రక్షణ కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని తెలిపారు. పేదవర్గాలు ఈ రోజు సమాజంలో కొంత మేరకైన గౌరవంగా బతుకుతున్నారంటే అది అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలమేనన్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్‌లు కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి బాటలు వేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు కవిడ మురళీకృష్ణ, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, బండారు నరేష్, కవిడ రాంబాబు, యాసా సత్యనారాయణ, పొట్లపల్లి నాగార్జున, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో అలుపెరగని సేవకుడిలా పయనం..

- కృషి, పట్టుదలతో కూలీ నుంచి ప్రజా ప్రతినిధిగా ప్రయాణం
- సర్పంచ్ అభ్యర్థి బరిలో సతీమణి.. ప్రచారంలో దూకుడు
- అవకాశమిస్తే మరోసారి నిస్వార్థంగా సేవలందిస్తా: కొండ



మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ

బోనకల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాక్షేత్రంలో అలుపెరగని సేవకుడిలా పయనిస్తున్నాడు. నాడు రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబ నేపథ్యం నుంచి స్వయంకృషితో మంచిస్థాయికి ఎదగడంతోపాటు ప్రజలతో నిత్యం మమేకమవుతూ రెండు దశాబ్దాలుగా ప్రజా ప్రతినిధిగా సాగించిన ప్రయాణంలో వార్డు సభ్యుడి నుంచి ఉప సర్పంచ్, జడ్పీటీసీ పదవులను అలంకరించి వాటికి వన్నె తెచ్చాడు బోనకల్ మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ. ప్రస్తుతం జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా ఆయన సతీమణి జ్యోతిని బరిలో ఉంచి విస్తృత ప్రచారం చేస్తున్నాడు. ఈ సందర్భంగా కొండ దంపతులు శనివారం 'ఆంధ్రజ్యోతి'తో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఆంధ్రజ్యోతి: గతంలో మీరు చేసిన సేవా కార్యక్రమాలు ఏమిటి?

మాజీ జడ్పీటీసీ: కరోనా కష్టకాలంలో రెండు నెలల పాటు బాధితులకు ఆపన్నహస్తం అందించాం. నిరుద్యోగుల కోసం జాబ్ మేళా, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, చెరువు బజార్లో 30 మీటర్ల రోడ్డు నిర్మాణానికి స్వంత ఖర్చులతో పూర్తి చేయడంతో పాటు పలు శ్రమదాన కార్యక్రమాలను చేశామన్నారు.

ఆంధ్రజ్యోతి : మిమ్మల్ని గెలిపిస్తే గ్రామంలో ఏం పనులు చేస్తారు?

మాజీ జడ్పీటీసీ: ప్రధానంగా ప్రజలు కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, వాటిని అరికట్టే చర్యలు చేపడతాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాభివృద్ధి కొరకు చేపట్టే ప్రణాళికలు ఏమిటి?

మాజీ జడ్పీటీసీ: సినిమాహాల్ సెంటర్ వద్ద రింగు, సంత ఏర్పాటు, ఆళ్లపాడు-బోనకల్ రహదారికి ఇరువైపులా అండర్ డ్రెయిన్ నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, పారిశుధ్యం మెరుగుదల పనులు, కుక్కల బెడదను నివారించే విధంగా కృషి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: యువత కోసం మీరు చేసే పనులు ఏమిటి?

మాజీ జడ్పీటీసీ: చదువుల్లో ప్రతిభ చాటే వారిని ప్రోత్సహిస్తూ, పేద విద్యార్థులకు చేయూత, ఓపెన్ జిమ్ ఏర్పాటు, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే వారి కొరకు గ్రంథాలయ పునరుద్ధరణతో పాటు క్రీడా ప్రాంగణాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చే చర్యలు చేపడతాం.

ఆంధ్రజ్యోతి : వైద్య సేవల మెరుగుదల కోసం చేపట్టే చర్యలు?

మాజీ జడ్పీటీసీ: ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిని 24 గంటల పాటు వైద్య సేవలందించే విధంగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తాం.